



4 గంటల్లోనే ధాన్యం బిల్లులు

నిబంధనలకు అనుగుణంగా తేమశాతం ఉంటే మద్దతు ధర

- జిల్లాలో 7.90 లక్షల టన్నుల కొనుగోలుకు ప్రణాళిక
- ఇప్పటికే 40 వేల టన్నుల కొనుగోలు పూర్తి
- ప్రభుత్వానికి మిల్లర్లు సహకరించాలి
- మంత్రి నాదెండ్ల మనోహర్
- మంత్రి రవీంద్రతో కలిసి మిల్లులు, ఆర్‌ఎస్‌కేల తనిఖీ

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: ధాన్యం కొనుగోలు చేసిన నాలుగు గంటల్లోనే రైతుల బ్యాంకు ఖాతాలో నగదు జమ చేస్తామని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. జిల్లాలోని ఉయ్యూరు. గూడూరు, మచిలీపట్నంలోని రైతు సేవా కేంద్రాలు (ఆర్‌ఎస్‌కే), రైస్ మిల్లుల్లో ధాన్యం కొనుగోలు నిమిత్తం తీసుకుంటున్న చర్యలను మంత్రి కొల్లు రవీంద్ర, పెడన, పెనమలూరు ఎమ్మెల్యేలు కాగిత కృష్ణప్రసాద్, బోడె ప్రసాద్, పౌరసరఫరాల సంస్థ చైర్మన్ ఢిల్లీరావు, కలెక్టర్ బాలాజీ, జేసీ నవీన్ తదితరులతో కలిసి ఆయన బుధవారం పరిశీలించారు. ఉయ్యూరులోని ఆర్‌ఎస్‌కే-2, మచిలీపట్నంలోని సీతారామాంజనేయ రైస్‌మిల్లును సందర్శించారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్న విధానం, మిల్లులకు ధాన్యం తరలింపు కోసం వాహనాల ఏర్పాటు, ధాన్యం బాయిల్డ్ చేయడం తదితర అంశాలను గమనించారు.

తేమశాతం పరిశీలన

గండిగుంట గ్రామానికి చెందిన రైతు సతీష్‌కుమార్ సాగు చేసిన ఎంటీయూ 1262 రకం ధాన్యంలో తేమశాతాన్ని మంత్రి మనోహర్ సమక్షంలో పరిశీలించారు. 15.9 పాయింట్లు వచ్చింది. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మాట్లాడుతూ ధాన్యంలో 17 పాయింట్ల తేమ శాతం ఉంటే పూర్తిస్థాయిలో మద్దతు ధర లభిస్తుందన్నారు. మిగతా 6లో..

సాంకేతిక పరిజ్ఞానంతో కొనుగోళ్లు

ఈ ఏడాది రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేస్తామని, ఇందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. మచిలీపట్నం, ఉయ్యూరులో విలేకరులతో మంత్రి మనోహర్ మాట్లాడారు. గతేడాది రైతులు ధాన్యం విక్రయించిన 48 గంటల వ్యవధిలోనే బిల్లుల చెల్లింపులు చేశామన్నారు. ఈ ఏడాది అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని కేవలం నాలుగు గంటల్లోనే రైతుల ఖాతాల్లో జమచేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఏదైనా కారణాలతో ఆలస్యం జరిగినా 24 గంటల వ్యవధిలోనే పడతాయన్నారు. జిల్లాలో ఈ ఏడాది 7.90 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేసేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. రైతు సేవా కేంద్రాలలో పనిచేస్తున్న సాంకేతిక సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ, ధాన్యం కొనుగోలులో రైతులు ఇబ్బందులు పడకుండా చూస్తున్నామన్నారు.



మచిలీపట్నంలోని రైస్‌మిల్లులో వివరాలు తెలుసుకుంటున్న మంత్రుల నాదెండ్ల మనోహర్, కొల్లు రవీంద్ర, చిత్రంలో పౌరసరఫరాల సంస్థ చైర్మన్ ఢిల్లీరావు, కలెక్టర్ బాలాజీ, జేసీ నవీన్ తదితరులు

మెడికల్ కళాశాల వద్ద రైల్వేట్రాక్‌పై ఫ్లై ఓవర్ నిర్మాణం ప్రతిపాదనలకే పరిమితమైంది. రూ.25 కోట్ల నిర్మాణ వ్యయంతో పంపించిన ఫైల్ ముందుకు కదలడంలేదు. దీంతో వైద్య కళాశాలలో అత్యవసర సేవలు ప్రారంభానికి నోచుకోలేదు. విద్యార్థులు సైతం కళాశాలకు వెళ్లేందుకు రైల్వే ట్రాక్ దాటాల్సిన పరిస్థితి నెలకొంది.



మెడికల్ కళాశాలకు వెళ్లే రహదారిలో రైల్వేట్రాక్

ప్రతిపాదనలతోనే సరి..

మెడికల్ కళాశాల వద్ద రైల్వేట్రాక్‌పై ఫ్లై ఓవర్ నిర్మాణానికి గ్రహణం

రూ.25 కోట్లతో మూడేళ్ల క్రితం ప్రతిపాదనలు

- కళాశాలకు వెళ్లాలంటే విద్యార్థులు రైల్వే ట్రాక్ దాటాల్సిందే..
- ఫ్లై ఓవర్ నిర్మాణం తర్వాతే మెడికల్ కళాశాలలో అత్యవసర వైద్యసేవలు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : మచిలీపట్నం మెడికల్ కళాశాలను సమస్యలు వెంటాడుతున్నాయి. మూడేళ్ల క్రితం 150 మంది విద్యార్థులతో ఎంబీబీఎస్ తరగతులు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం ఎంబీబీఎస్ కోర్సుకు సంబంధించి మూడో సంవత్సరం తరగతులు రెండు నెలల క్రితం ప్రారంభమయ్యాయి. రూ.550 కోట్ల అంచనాలతో నిర్మాణం చేస్తున్న మెడికల్ కళాశాల పనులు 60 శాతం మేర పూర్తయ్యాయి. మెడికల్ కళాశాలలో ఇప్పటికే వైద్యసేవలు ప్రారంభం కావాల్సి ఉన్నా ప్రారంభించలేదు. మచిలీపట్నంలోని జిల్లా కేంద్ర ఆసుపత్రికి సర్వజన ఆసుపత్రిగా పేరు మార్చి మెడికల్ కళా శాలగా చూపుతున్నారు.

ప్రధాన అడ్డంకిగా రైల్వేట్రాక్!

మచిలీపట్నం మెడికల్ కళాశాలకు వెళ్లాలంటే రైల్వే ట్రాక్‌ను దాటాలి. కళాశాలకు 700 మీటర్ల దూరంలోనే రైల్వేట్రాక్ ఉంది. ప్రతి రోజు పదికిపైగా రైళ్లు ఈ మార్గం గుండా రాకపోకలు సాగిస్తున్నాయి. రైలు వచ్చిన సమయంలో గేటు పడితే కనీసంగా పది నిమిషాలు రాకపోకలు నిలిచిపోతాయి. ఈ నేపథ్యంలో మిగతా 6లో..

'దివిసీమ ఉప్పెన'తో నాలో మార్పు

- అవనిగడ్డలో దివిసీమ ఉప్పెన సంస్మరణ సభ

మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ



ఫొటో ప్రదర్శనను తిలకిస్తున్న దత్తాత్రేయ, చిత్రంలో మంత్రి రవీంద్ర, ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, రాజకీయ నేతలు తులసిరెడ్డి, మర్రి శశిధర్‌రెడ్డి తదితరులు

అవనిగడ్డ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): దివిసీమ ఉప్పెన పునర్నిర్మాణ కార్యక్రమాలు తన జీవితంలో గొప్ప మార్పును తీసుకొచ్చాయని మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. ఓ రకంగా దివిసీమ తన కర్మ భూమి అని పేర్కొన్నారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ నేతృత్వంలో 1977 దివిసీమ ఉప్పెన 48 సంవత్సరాల సంస్మరణ సభ, మండలి వెంకట కృష్ణారావు శత జయంతి వేడుకలు బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన దత్తాత్రేయ మంత్రి రవీంద్రతో కలిసి మండలి వెంకట కృష్ణారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గాంధీ క్షేత్రంలో ఏర్పాటు చేసిన ఉప్పెన ఫొటో ఎగ్జిబిషన్ తిలకించారు. బండారు దత్తాత్రేయ ఉప్పెన సమయంలో చేసిన సేవా కార్యక్రమాల ఫొటోలను చూసి నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ మాట్లాడుతూ మరుభూమిగా మారిన దివిసీమ గ్రామాలైన పర్రచివర, దిండి, సొర్లగొంది, మూలపాలెం, కోడూరు గ్రామాల్లో తాము చేసిన సేవలు ఎన్నటికీ మరువలేనివని తెలిపారు. సామూహిక శవ దహన కార్యక్రమాలు నిర్వహించామని గుర్తు చేసుకున్నారు. నాడు మంత్రిగా ఉన్నప్పటికీ మూల్లపాడు నడిచి తమకు మండలి వెంకట కృష్ణారావు ప్రేరణ కలిగించారని తెలిపారు. దేశ విదేశాల నుంచి 132 స్వచ్ఛంద సంస్థలు దివి ప్రాంతంలో సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు వచ్చాయని, నాటి సేవా సంస్థల కమిటీకి తాను ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించానని చెప్పారు. మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ దివిసీమ పునర్నిర్మాణం, అభివృద్ధికి స్వచ్ఛంద సంస్థలను కలుపుకుని మండలి వెంకట కృష్ణారావు చేసిన కృషి మరువలేనిదన్నారు. ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ మిగతా 6లో..

రెచ్చిపోతున్న రేషన్ డాన్

నియోజకవర్గానికో డాన్‌తో రేషన్ మాఫియా



- ఉమ్మడి కృష్ణాజిల్లాలో భారీగా బియ్యం వ్యాపారం
- డీలర్లంతా డాన్లకే అమ్మాలి.. లేకపోతే దాడులే
- కొందరు ప్రజాప్రతినిధులకు రూ.లక్షల్లో మామూళ్లు

ఉమ్మడి కృష్ణాజిల్లాలో ప్రజా పంపిణీ వ్యవస్థ రాజకీయ రేషన్ డాన్‌ల చేతుల్లోకి వెళ్లింది. నియోజకవర్గానికో డాన్ ఎదుగుతున్నాడు. పేదలకిచ్చే నిత్యావసరాలను గద్దల్లా తన్నుకుపోతున్నారు. విజయవాడ, మచిలీపట్నం సహా జయంతి, విస్సన్నపేట, తిరువూరు, గన్నవరం, గుడివాడలోని సిండికేట్ వ్యాపారులు ఈ డాన్‌లకు భయపడి వ్యాపారాలను తగ్గించుకునే పరిస్థితికి వచ్చారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఉమ్మడి కృష్ణాజిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో ఒక రాజకీయ రేషన్ డాన్ ఆధీనంలో పేదల బియ్యం వ్యాపారం నడుస్తోంది. ఈ వ్యాపారం ఏ స్థాయిలో నడుస్తోందంటే.. నియోజకవర్గ కీలక ప్రజాప్రతినిధులకూ నెలవారీగా ఫిక్స్‌డ్ రేటు చెల్లించి వ్యాపారాన్ని ఎలాంటి అవాంతరాలు లేకుండా నడిపిస్తున్నారు. నెలవారీగా రూ.ఏడు లక్షల నుంచి రూ.తొమ్మిది లక్షల చొప్పున రేషన్ డాన్లు కొందరు ప్రజాప్రతినిధులకు వాటాలు చెల్లిస్తున్నారంటే ఏ మేరకు వ్యాపారం జరుగుతుందో అర్థమవుతుంది. ప్రజాప్రతినిధులకు వాటాలు ఇవ్వటం ద్వారా సివిల్ సప్లయిస్ అధికారులు నోరు మెదపలేరు. పోలీసులు కన్నెత్తి చూడరు. విజిలెన్స్ అంతకన్నా పట్టించుకోదని తెలుసుకుని అడిగినంత ముట్టజెబుతున్నారు.

ప్రభుత్వ ఆశయాలకు తూట్లు పొడిచేలా...

ఓపక్క ప్రభుత్వం నూరుశాతం నిత్యావసరాల పంపిణీ జరగాలని, పౌష్టికాహారం పేదలకు చేరాలన్న లక్ష్యాలను నిర్దేశిస్తుంటే.. నియోజకవర్గాల స్థాయిలో జరుగుతున్న రేషన్ డాన్ల అక్రమాలు అడ్డుగోడలుగా మిగతా 6లో..

సరిహద్దులు దాటిపోతున్న సరుకు

పేదల బియ్యాన్ని డీలర్ల నుంచి కొన్నాక వ్యవస్థలను అడ్డం పెట్టుకుని అవలీలగా సరిహద్దులు దాటించేస్తున్నారు. కాకినాడ పోర్టుకు కొంత, ముంబయి పోర్టుకు కొంతమేర తరలిస్తున్నారు. ఫిలిప్పైన్స్ దేశంలో పీడీఎస్ బియ్యానికి ధర ఎక్కువగా పలుకుతుండటంతో డాన్లు స్వేచ్ఛగా పోర్టులకు తరలిస్తున్నారు. పెద్దమొత్తంలో రేషన్ బియాన్ని ఇటీవల కాలంలో పట్టుకోకపోవటం వెనుక డాన్లు వ్యవస్థలను చేతుల్లోకి తీసుకోవడమే కారణం. కేసుల కోసం చిన్నాచితకా వ్యాపారులపై దాడులు చేయటం తప్ప, అసలైన డాన్ల జోలికి వెళ్లట్లేదు.

నాగాయలంకలోని శ్రీరామపాదక్షేత్రం వద్ద కృష్ణానదిలో పాముల సంచారం



శ్రీరామపాదక్షేత్రంలో వింత సర్పాలు ప్రత్యక్షం

అవనిగడ్డ/నాగాయలంక, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : నాగాయలంక శ్రీరామపాదక్షేత్రం ఘాట్‌లోని శ్రీరామంగేశ్వరస్వామి ఆలయం వద్ద గత రెండు రోజులుగా సర్పాలు సందడి చేస్తున్నాయి. రామలింగేశ్వరస్వామికి అభిషేకాలు పూర్తయ్యే నాటికి ఘాట్‌లోకి వందలాదిగా చిన్న చిన్న సర్పాలు వచ్చి నదిలో చక్కర్లు కొడుతూ ఉండటంతో భక్తులు సంభ్రమాశ్చర్యాలకు గురవుతున్నారు. ఇదంతా మిగతా 6లో..

రైతును రాజుగా మార్చేందుకు కృషి

- మంత్రి కొల్లు రవీంద్ర
- రైతుల ఖాతాల్లో అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ 2వ విడత నగదు జమ

తానా సేవలు అభినందనీయం

- ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు
- రూ.25 లక్షలతో ఉపకరణాల పంపిణీ 8

ఆ కాంట్రాక్టర్ ఎవరు?

కొత్త ఆటోనగర్‌లో మావోయిస్టు షెల్టర్ ఏర్పాటులో కొత్తకోణం

- భవనం మూడో అంతస్తును అద్దెకు తీసుకున్న ఓ కాంట్రాక్టర్
- కన్‌స్ట్రక్షన్ పనికోసం కూలీలు వస్తున్నారని మేనేజర్‌కు సమాచారం
- అడ్వాన్స్ కూడా అతడే చెల్లింపు.. ప్రస్తుతం పరార్
- గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు

కానూరు కొత్త ఆటోనగర్‌లోని భవనంలో మావోయిస్టులకు ఆశ్రయం కల్పించింది ఎవరు? కూలీల కోసమని మూడో అంతస్తును అద్దెకు తీసుకున్న ఆ వ్యక్తి ఎవరు? సదరు కాంట్రాక్టర్‌కు మావోయిస్టులతో సంబంధాలు ఉన్నాయా? అనే అనేక సందేహాలు కలుగుతున్నాయి. ప్రస్తుతం ఆ కాంట్రాక్టర్ పరారీలో ఉండగా, పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.





(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : కానూరులోని కొత్త ఆటోనగర్‌లో జీప్లస్‌త్రీ భవనంలో మావోయిస్టులు ఆశ్రయం పొందిన వ్యవహారంలో కొత్తకోణం వెలుగులోకి వచ్చింది. ఖాళీగా ఉన్న మూడో అంతస్తును ఓ కాంట్రాక్టర్ అద్దెకు తీసుకున్నట్టు పోలీసులు గుర్తించారు. ఇప్పుడు ఆ కాంట్రాక్టర్ ఎవరన్న విషయాన్ని వెలుగులోకి తీసుకురావాలని ప్రయత్నాలు చేస్తున్నారు. మొత్తం 28 మంది మావోయిస్టులు ఈ భవనం మూడో అంతస్తులో ఆశ్రయం పొందిన విషయం తెలిసిందే. అసలు వారంతా ఈ భవనంలోకి ఎలా వచ్చారన్న దానిపై భిన్నవాదనలు వినిపించాయి. తొలుత కూలీలు వాచ్‌మన్‌తో మిలాఖత్ అయి ఇక్కడ ఆశ్రయం ఇప్పించారన్న వాదనలు వినిపించాయి. దీనిపై లోతుగా పరిశీలన చేస్తే ఒక కాంట్రాక్టర్ 20 రోజుల క్రితం మూడో అంతస్తును అద్దెకు తీసుకున్నట్టు తేలింది. తాను త్వరలో ప్రారంభించబోయే కనస్ట్రక్షన్ ప్రాజెక్టులో పనిచేయడానికి ఇతర రాష్ట్రాల నుంచి కూలీలు వస్తున్నారని.. భవన బాధ్యతలను చూస్తున్న మేనేజర్‌కు చెప్పినట్టు తెలిసింది. దీంతో ఇదంతా వాస్తవమేనని మేనేజర్ భావించారు. దీనికి అడ్వాన్స్ ఆ కాంట్రాక్టరే చెల్లించినట్టు తెలిసింది. మిగతా 6లో..

ప్రసాదంపాడు షెల్టర్ వెనుక సానుభూతిపరుడు?

పటమట పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రసాదంపాడులో ఓ ఇంట్లో మావోయిస్టులు తలదాచుకోవడం వెనుక సానుభూతిపరుడు ఉన్నట్టు పోలీసులు నిర్ధారించారు. అదే గ్రామానికి చెందిన రవి అనే సానుభూతిపరుడు పొడియా భీమా, మడకం లక్మ, మడవి చిన్మయ్, మంగి డొక్కుపాడి అనే మావోయిస్టులను ఇక్కడికి తీసుకొచ్చినట్టు తెలిసింది. వారిని విజయ ఆగ్రో మిల్లు రోడ్డులో ఇంట్లో పెట్టాడు. వారికి ఇంటిని అద్దెకు ఇప్పించడంలో రవి కీలకంగా వ్యవహరించినట్టు తేలింది. ఈ నలుగురు మావోయిస్టులను అదుపులోకి తీసుకోగానే రవి పరారయ్యాడు. అతడి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

ప్రతిఘటించి ఉంటే..

కొత్త ఆటోనగర్‌లో భయాందోళనలు

- తుపాకులతో మావోలు
- ఎదురుగా బంకు, పక్కనే ఆయిల్ కంపెనీ
- ప్రతిఘటించి ఉంటే భారీ నష్టమే..
- లొంగిపోవడంతో తప్పిన ప్రమాదం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీ) : అరెస్టు సమయంలో మావోయిస్టులు పోలీసులను ప్రతిఘటిస్తే పెద్ద విధ్వంసమే జరిగేదా? అంటే.. అవుననే సమాధానమే వస్తుంది. కొత్త ఆటోనగర్‌లో మావోయిస్టులు ఆశ్రయం పొందిన మారుతి బిల్డింగ్ చుట్టూ అనేక కంపెనీలు ఉన్నాయి. రోడ్డుకు పడమర దిక్కున ఉండే ఈ భవనాన్ని ఆనుకుని ఎడమవైపు ఏసీ బాక్సుల తయారీ యూనిట్, కుడివైపు మౌల్డింగ్ యూనిట్ ఉన్నాయి. రోడ్డుకు అవతలి వైపున, భవనానికి ఎదురుగా మౌల్డింగ్ యూనిట్ ఉంది. ఈ యూనిట్‌ను ఆనుకునే పెట్రోల్ బంక్ ఉంది. భవనానికి కొంచెం దూరంలో ఆయిల్ కర్మాగారం ఉంది. ఏసీ బాక్సుల తయారీ యూనిట్‌లో దాదాపు పదిమంది కార్మికులు పని చేస్తుంటారు. రెండు మౌల్డింగ్ యూనిట్‌లలో షిఫ్టుకు దాదాపు 50 మందికి పైగా పనిచేస్తున్నారు. ఆయిల్ కర్మాగారంలో 20 మందికి పైగా పనిచేస్తున్నారు. మారుతి బిల్డింగ్ ఉన్న రోడ్డులో దాదాపు 15 యూనిట్ల వరకు ఉన్నాయి. వీటిల్లో వందలాది మంది కార్మికులు పనిచేస్తున్నారు. ఈ రోడ్డులోనే ఉండే ఆయిల్ కర్మాగారంలో ఇటీవల అగ్నిప్రమాదం మిగతా 6లో..



మహామండపం దిగువన, కనకదుర్గానగర్‌లో భవానీదీక్షల విరమణల ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఈవో, ఏడీసీపీ, అధికారులు

ఇంద్రకీలాద్రిపై హోమగుండాల పరిశీలన

» భవానీల దీక్ష విరమణకు అన్ని వసతులు కల్పిస్తాం : ఈవో

ఇంద్రకీలాద్రి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో డిసెంబరు 11 నుంచి 15వరకు జరగనున్న భవానీదీక్షల విరమణలను పురస్కరించుకుని భవానీలకు ఏర్పాటు చేయనున్న హోమగుండాలు, ఇరుముడుల పాయింట్ కౌంటర్లను బుధవారం ఈవో శీనానాయక్, ఏడీసీపీ గుణ్ణం రామకృష్ణలు ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మహామండపం దిగువన నూతనంగా నిర్మిస్తున్న అన్నదాన భవనం ఎదురుగా ఒక హోమగుండం, నూతనంగా నిర్మిస్తున్న లడ్డూ ప్రసాదం తయారీ భవనం పక్కన మరొక హోమగుండం, కనకదుర్గానగర్‌లో ఉన్న షాపులు ఎదురుగా ఇంకొక హోమగుండం ఏర్పాటు చేయనున్నట్టు ఈవో, ఇంజనీరింగ్ అధికారులు ఏడీసీపీకి వివరించారు. ఇరుముడుల పాయింట్ల కౌంటర్లను మహామండపం దిగువన రేకుల షెడ్డు కింద ఏర్పాటు చేస్తున్నట్టు పోలీసు అధికారులకు తెలిపారు. భక్తులు, భవానీలకు ఎలివేటెడ్ క్యూలైన్ల కింద బఫే విధానంలో అన్న ప్రసాదం పంపిణీ ఏర్పాటు చేయనున్నట్టు ఈవో ఏడీసీపీకి వివరించారు. అనంతరం ప్రసాదాల కౌంటర్ల ఏర్పాటును అధికారులు పరిశీలించారు. ఈనెల 20న గురువారం ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్, పోలీసు కమిషనర్, మునిసిపల్ ఉన్నతాధికారులు, ఇతర విభాగాల అధికారులతో కలిసి భవానీదీక్షల విరమణల ఏర్పాట్లను పరిశీలించి తుది నిర్ణయం తీసుకోనున్నట్టు ఈవో తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఇంజనీరింగ్ అధికారులు వెస్ట్ ఏసీపీ దుర్గారావు, వన్‌టౌన్ సీఐ గురుప్రకాష్ తదితరులు ఉన్నారు.

అమ్మ సన్నిధిలో ఇష్టారాజ్యానికి చెక్!

» విధుల నుంచి నాయక్ సోదరుల తొలగింపు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]



రమేష్ నాయక్



రాజేష్ నాయక్

ఇంద్రకీలాద్రి : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో ప్రైవేటు సెక్యూరిటీ విభాగంలో ఇష్టానుసారంగా విధులు నిర్వహిస్తు భక్తులపై దాడికి పాల్పడుతున్న, సెక్యూరిటీ సిబ్బంది అటెండెన్స్‌లో అవకతవకలకు పాల్పడుతన్న నాయక్ సోదరులను ఈవో శీనానాయక్ మంగళవారం విధుల నుంచి తొలగించారు. వీరి వ్యవహారంపై విచారణ చేపట్టాలని ఆదేశించారు. విచారణ అధికారులుగా ఏసీ రంగారావు, ఏఈవోలు ఎన్.రమేష్‌బాబు, వాసులను నియమించారు. దుర్గగుడి ప్రైవేటు సెక్యూరిటీ విభాగంలో విధులు నిర్వహిస్తున్న రాజేష్ నాయక్ గత కొద్ది రోజుల క్రితం కనకదుర్గానగర్‌లో భక్తులతో గొడవపడి కొట్టాడు. ఈ ఘటనపై భక్తులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇతని సోదరుడు రమేష్ నాయక్ సెక్యూరిటీ గార్డుల అటెండెన్స్ పుస్తకంలో విధులకు హాజరుకాని ఉద్యోగులను వచ్చినట్టుగా నమోదుచేసి ప్రతినెలా జీతాలలో కొంత మేరకు స్వాహా చేస్తున్నట్టు ఆరోపణలు వచ్చాయి. నాయక్ సోదరుల వ్యవహారంపై నాలుగు రోజుల క్రితం 'ఆంధ్రజ్యోతి'లో 'నాయక్ సోదరుల ఇష్టారాజ్యం' కథనం రావటంతో స్పందించిన ఈవో సంబంధిత విభాగం ఏఈవో రమేష్ బాబును వివరాలు అడిగి తెలుసుకున్నారు. దీనిపై విచారణ చేసి పూర్తి నివేదిక అందచేయాలని ఆదేశించారు.



పాత వంతెన తొలగించేందుకు తెచ్చిన భారీ క్రేన్, వంతెన శిథిలాలను పక్కన వేస్తున్న ఎక్స్‌కవేటర్

ఎర్ర బ్రిడ్జి విస్తరణ పనులు ప్రారంభం

» నాలుగు లేన్లుగా అభివృద్ధి

» దశాబ్ద కాలం తర్వాత రెండో వైపు ఎత్తు పెంపు

» కొండపల్లి రైల్వేస్టేషన్‌కు అండర్‌పాస్‌ల ఏర్పాటు

(ఇబ్రహీంపట్నం, ఆంధ్రజ్యోతి) : ఇబ్రహీంపట్నం-ఛత్తీస్‌గఢ్ జాతీయ రహదారి 30పై కొండపల్లి ఎర్రబ్రిడ్జిని నాలుగు లైన్లుగా విస్తరణ పనులను ఎన్‌హెచ్ అధికారులు ప్రారంభించారు. గతంలో ఎర్రబ్రిడ్జి ఎత్తును పెంచి రెండు లైన్లు చేసిన అధికారులు దానిని నాలుగు లైన్ల విస్తరణకు శ్రీకారం చుట్టారు. దశాబ్దకాలం క్రితం ఇబ్రహీంపట్నం నుంచి జి.కొండూరు వరకు జాతీయ రహదారిని నాలుగు లైన్లుగా విస్తరించారు. ఆ సమయంలో కొండపల్లి ఎర్రబ్రిడ్జి వద్ద రహదారిని డబుల్ లైన్ వేశారు. ఈ నేపథ్యంలో ఎన్.హెచ్ అధికారులు గతంలో డబుల్ లైన్‌గా ఏర్పాటు చేసిన ఎర్రబ్రిడ్జికి సమాంతరంగా ఉన్న వంతెనను ఎత్తు పెంచి మరో రెండు లైన్లను వాహనచోదకులకు అందుబాటులోకి తీసుకురానున్నారు. పాతవంతెన తొలగింపు పనులు కొనసాగుతున్నాయి. ఎట్టకేలకు ఎర్రబ్రిడ్జ్ ఎత్తు పెరగడం, కొండపల్లి గ్రామంలోకి అండర్ పాస్‌ల ద్వారా రహదారి సౌకర్యం రావటంతో వాహన చోదకులకు, కొండపల్లి ప్రాంత వాసులకు శుభవార్తే అని చెప్పాలి.

ఉచిత బస్సులో టికెట్ అడుగుతావా?

» ఎస్‌ఎం పేటలో ఆర్టీసీ కండక్టర్‌పై వ్యక్తి దాడి

» నేడు డిపో ఎదుట కార్మికుల ఆందోళన

జగ్గయ్యపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఉచితం అని ప్రభుత్వం చెబుతుంటే మమ్మల్నే టికెట్ అడుగుతావా.. అంటు జగ్గయ్యపేట ఆర్టీసీ డిపో కండక్టర్‌పై షేర్‌మహ్మద్‌పేట గ్రామంలో ఓవ్యక్తి దాడిచేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీనిపై కండక్టర్ ఫిర్యాదు చేయడంతో ప్రతిగా అధికార పార్టీనేతలు మహిళలతో ప్రతి ఫిర్యాదు చేయించారు. ఆర్టీసీ కార్మికసంఘాలు ఆందోళనకు పిలుపునివ్వటంతో బుధవారం సాయంత్రం పోలీసులు ఇరుపక్షాలతో రాజీచేసి క్షమాపణ చెప్పించారు. ఫ్రీ బస్సుపథకం కండక్టర్లు, డ్రైవర్లకు ఇబ్బందిగా మారిందని తమకు రక్షణ కల్పించాలని ఆర్టీసీ యూనియన్లు గురువారం డిపో ఎదుట ఆందోళనకు ఉపక్రమించాయి. వివరాల్లోకి వెళితే.. జగ్గయ్యపేట నుంచి కోదాడకు తిరిగే షటిల్ సర్వీసులు ఆంధ్రా, తెలంగాణా మధ్య అంతర్రాష్ట్ర సర్వీసుగా ఉండటంతో ప్రయాణికులకు చార్జీలు వసూలు చేస్తున్నారు. సోమవారం షేర్‌మహ్మద్‌పేటలో వనభోజనాల సందర్భంగా పెద్దఎత్తున మహిళలు జగ్గయ్యపేట క్రాస్ రోడ్డుకు ఎక్కారు. కండక్టర్ వారిని మినిమం టికెట్ రూ.10లు తీసుకోవాలని చెప్పగా గ్రామానికి చెందిన అధికార పార్టీనేత కండక్టర్‌తో వాదనకు దిగాడు. ప్రభుత్వం ఫ్రీబస్సు పెడితే మహిళల వద్ద టికెట్ అడుగుతావా అంటు నిలదీశాడు. ఈ బస్సుకు అది వర్తించదని చెబుతున్నా వినకుండా ఘర్షణకు దిగాడు. దీనిపై ఇరువర్గాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆర్టీసీ కార్మికసంఘాలు కండక్టర్‌పై దాడిని సీరియస్‌గా తీసుకుని గురువారం డిపో ఎదుట ధర్నాకు పిలుపు ఇవ్వటంతో బుధవారం రెండువర్గాలను పిలిపించి దాడిచేసిన వ్యక్తితో కండక్టర్‌కు క్షమాపణ చెప్పించి సర్దుబాటు చేశారు. కండక్టర్‌పై దాడి చేసిన వ్యక్తిని పిలిపించి క్షమాపణ చెప్పించామని చిల్లకల్లు ఎస్సై శ్రీనివాస్ చెప్పారు. ఆర్టీసీ ఉద్యోగులకు రక్షణ కల్పించాలని డిపో ఎదుట ఆందోళన చేస్తామని కార్మికనేత కల్యాణం కృష్ణారావు చెప్పారు. ఉచిత బస్సు పథకంపై ప్రజల్లో అవగాహన కల్పించకపోవటం వల్ల సమస్య వస్తున్నదని చెప్పారు.

షాక్‌లోనే న్యూ ఆటోనగర్!





» మా సెల్‌ఫోన్లు తీసుకున్నారు.. ఏం జరుగుతుందో అర్థం కాలేదు

» తేరుకునేలోపే.. మావోయిస్టులను కిందకు తీసుకువచ్చారు

» మా చెంతనే మావోయిస్టులు ఉన్నారంటే.. నమ్మలేకపోతున్నాం..

» 'ఆంధ్రజ్యోతి'తో న్యూ ఆటోనగర్ కార్మికుల అంతరంగం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీ)

మావోయిస్టుల మకాంపై న్యూ ఆటోనగర్ ఇంకా షాక్‌లోనే ఉంది. తమ చెంతనే మావోయిస్టులు ఉన్నారంటే నమ్మలేకపోకపోతున్నామని అక్కడి కార్మికులు చెబుతున్నారు. కూలీల ముసుగులో దాదాపు 15 రోజుల పాటు వారి మధ్యనే ఉన్న మావోయిస్టులను అరెస్టు చేసేందుకు పోలీసు బలగాలు మోహరించిన వైనం ఇంకా కార్మికుల కళ్లెదుటే మెదులుతోంది. కొద్దిసేపట్లో అత్యంత చాకచక్యంగా పోలీసులు ముగించిన ఆపరేషన్ న్యూఆటోనగర్ చర్చ కార్మికుల మధ్య కొనసాగుతూనే ఉంది. పోలీసులు రావడం, మావోలను అరెస్ట్ చేయడం అంతా క్షణాల్లోనే జరిగిపోయిందని చెబుతున్నారు. ఆపరేషన్ న్యూఆటోనగర్‌పై 'ఆంధ్రజ్యోతి'తో పలువురు కార్మికుల అంతరంగం..

ఒక్కసారిగా ఖంగుతిన్నా..

- రత్నం, న్యూ ఆటోనగర్ కార్మికురాలు



చాలా సంవత్సరాలుగా ఇదే కంపెనీలో పనిచేస్తున్నాను. ఈ ప్రాంతంలో చిన్నచిన్న దొంగతనాలు తప్ప పెద్ద నేరాలు ఏమీ జరగవు. అలాంటిది మా కంపెనీ ఎదురు బిల్డింగ్‌లోనే ఉంది. మావోయిస్టులు అంటే ఇప్పటికీ నమ్మలేకపోతున్నాను. పోలీసులు వచ్చి వారిని తీసుకెళ్తుంటే ముందుగా వారంతా దొంగలేమోనని అనుకున్నాం. తరువాత వారంతా మావోయిస్టులని చెప్పగానే ఒక్కసారిగా భయం వేసింది.

షాక్ నుంచి తేరుకునే లోగానే..

- నరసమ్మ, కార్మికురాలు

ఉదయం తొమ్మిది గంటలకు పనిలోకి వచ్చాను.



కంపెనీలో ఎవరిపని వారు చేసుకుంటున్నాం. అయితే ఉదయాన్నే కొందరు కొత్తవాళ్లు ఇక్కడ తిరగడం గమనించాను. సుమారు 10.30 గంటలకు నాలుగు బస్సులు వచ్చి ఆగాయి. మేము ఎటూ కదలకుండా, ఎవరితోనూ మాట్లాడకుండా చేశారు. ఏంజరుగుతోందో తెలియక అయోమయంలో ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నాం. షాక్ నుంచి తేరుకునే లోగానే అంతా జరిగిపోయింది.

పోలీసుల మోహరింపుతో భయపడ్డా

- సత్యవతి, కార్మికురాలు



ఇక్కడ ఎవరెవరో వచ్చి వారివారి కంపెనీల్లో పని చేసుకుంటారు. ఎవరు, ఎంటీ అనే ఆరా ఇక్కడ ఎవరూ తీయరు. మా కంపెనీ ఎదురుగా ఉన్న భవనంలో మావోయిస్టులు ఉన్నారన్న విషయం ఎలా తెలుస్తుంది. ఒక్కసారిగా 50 మందికి పైగా పోలీసులు రావడంతో భయపడ్డాను. వారు వచ్చీ రావడంతోనే కొందరు పోలీసులు నక్సలైట్‌లు ఉన్న భవనంలోకి వేగంగా వెళ్లారు. కొందరు పోలీసులు మమ్మల్ని చుట్టుముట్టారు.

తెల్లకారులో ప్రతిరోజూ వారికి భోజనం..

- వెంకటేశ్వరరావు, సెక్యూరిటీ గార్డ్



మావోయిస్టులు తలదాచుకున్న భవన యజమాని ఇక్కడ ఉండడు. ఇక్కడ వ్యవహారాలన్నీ సూపర్‌వైజర్ చూసుకుంటాడు. మావోయిస్టులు ఇక్కడకు రావడానికి ఒకరోజు ముందు సూపర్‌వైజర్ నన్ను కలిశారు. రోడ్డు పనులు చేసుకునే కూలీలకు మూడో ఫ్లోర్ అద్దెకు ఇచ్చానని, కాస్త చూస్తుండమని చెప్పి వెళ్లిపోయాడు. వారంతా కూలీలనే అనుకున్నాం. అయితే నెంబర్ ప్లేట్‌లేని తెల్లని మహీంద్రా కారులో ప్రతిరోజూ వచ్చి వారికి భోజనం అందించి వెళ్లేవారు. భోజనం వాహనం రాగానే ముగ్గురు మాత్రమే కిందకు వచ్చి తీసుకెళ్లే వారు. మిగిలిన వారు ఎప్పుడూ బయటకు వచ్చేవారు కాదు. వారిని పోలీసులు అరెస్టు చేసి తీసుకెళ్తుంటేనే అందరం చూశాం. అప్పటి వరకు వారిని ఇక్కడ ఎవరూ చూడలేదు.

సీసీ కెమెరాలను పక్కకు తిప్పేశారు

- సుందరరావు, ఏసీ బాక్స్‌ల తయారీ కంపెనీ కార్మికుడు



మావోయిస్టులు ఉన్న భవనానికి ఆనుకునే మా కంపెనీ ఉంటుంది. ఎప్పటిలాగానే ఉదయం ఎనిమిది గంటలకే పనిలోకి వచ్చాను. 10.30 తరువాత పోలీసులు ఒక్కసారిగా మా కంపెనీలోకి వచ్చారు. పెద్ద గన్స్ పట్టుకుని వచ్చిన పోలీసులను చూసి భయపడ్డాం. వచ్చీ రావడంతోనే మా కంపెనీ, మావోలు తలదాచుకున్న బిల్డింగ్ సీసీ కెమెరాలను పక్కకు తిప్పేశారు. మా కంపెనీలో అందరినీ ఒకచోట కూర్చోబెట్టారు. కొన్ని గంటల పాటు కాలు కూడా కదలనివ్వలేదు.

మా ఫోన్‌లు తీసుకుని చుట్టుముట్టారు

- శ్రీనివాసరావు, న్యూ ఆటోనగర్ కార్మికుడు



24 గంటలు పనిచేసే కంపెనీ మాది. ఇక్కడ కూడా ఒడిసా రాష్ట్రానికి చెందిన వారు పనిచేస్తుంటారు. వారికి తెలుగురాదు. పోలీసులు రాగానే మా కంపెనీలో ముగ్గురు వ్యక్తులు టీ తాగుతూ రోడ్డుపై ఉన్నారు. పోలీసులు వచ్చీరాగానే వారిని ప్రశ్నించి, అనుమానించి వెంటనే చేతులు వెనక్కి విరిచి కట్టేశారు. ఇంతలో మావోయిస్టులు ఉన్న బిల్డింగ్‌లోకి కొందరు వెళ్లారు. కొందరు మా కంపెనీలోకి వచ్చి మమ్మల్ని రౌండప్ చేశారు. మా ఓనర్ దగ్గర, మా దగ్గర ఫోన్లను లాగేసుకున్నారు. మమ్మల్ని ఒక చోట కూర్చుబెట్టి కదలనివ్వలేదు. అడిగే అవకాశం సైతం ఇవ్వలేదు. చేతులు కట్టేసిన కూలీలు మావాళ్లేనని మా ఓనర్ చెప్పడంతో వారిని విడిచిపెట్టారు. సాయంత్రం నాలుగు గంటల తరువాత మా ఫోన్‌లు మాకు ఇచ్చారు.

పత్తి చిత్తు!



ట్రాక్టర్‌తో పత్తి పంటను దున్నేస్తున్న రైతు



సీసీఐ అధికారులు తిరస్కరిస్తున్న పత్తి రకం

» పంట ఉండగానే చేలు దున్నేస్తున్న రైతులు

» తీతల కూలీ రాదని పొలాల్లోనే వదిలేస్తున్న వైనం

» ప్రత్యామ్నాయ సాగుకు సాయం అందించాలి

» పండిన పంటను కొనుగోలు చేయని సీసీఐ

» కమర్షియల్ కార్పొరేషన్.. పట్టని పాలకులు!

నందిగామ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పత్తి రైతు గతంలో ఎన్నడూ ఎదుర్కోని కష్టాన్ని చవిచూశాడు. చెట్లకు ఉన్న పత్తి తీయకుండా దున్నివేసిన ఘటనలు ఇంతవరకూ జరగలేదు. క్వింటా పత్తి తీసేందుకు రూ.3వేలు ఖర్చు కాగా, ఆ పత్తిని కొనేవారు లేక రైతులు ఇబ్బంది పడుతున్నారు. అండగా నిలవాల్సిన ప్రజాప్రతినిధులు, ఆదుకోవాల్సిన సీసీఐ మొఖం చాటేయడంతో చేసేది లేక కన్నీళ్లు దిగమింగుతూ పంటను దున్నేస్తున్నారు. అప్పుడప్పుడూ నష్టాలు వచ్చినా ఈఏడాది జరిగినంత నష్టం ఎన్నడూ జరగలేదు. సాధారణంగా పత్తి దిగుబడులు మార్చి నెలాఖరు వరకూ వస్తుంటాయి. ముఖ్యంగా నవంబర్, డిసెంబరు మాసాలలో నాణ్యమైన పత్తి దిగుబడులు వస్తుంటాయి. కానీ ఈ ఏడాది నవంబరు మొదటి వారానికే పంట ముగిసింది. ప్రారంభం నుంచి భారీ వర్షాలు నమోదవడంతో దెబ్బతిన్న పంటలకు అధిక మోతాదులో ఎరువులు అందించి నిలబెడుతూ వచ్చారు. దీనికోసం అన్నదాతలు భారీగా పెట్టుబడులు పెట్టాల్సి వచ్చింది. కంటికి రెప్పలా కాపాడుతూ వచ్చిన పంటను మొంథా తుఫాను కబళించింది. వారం రోజుల పాటు కురిసిన వర్షాలతో పూత, కాయ కుళ్లిపోయింది. తీతలకు సిద్ధంగా ఉన్న పత్తి పూర్తిగా తడిసిపోయింది. రోజుల తరబడి పొలాలు ఆరకపోవడంతో మొక్కలు నీటి ఊట వల్ల ఎండిపోయాయి. డ్రోన్‌ల సాయంతో అధికారులు పంట నష్టం అంచనా వేశారు. నష్టంపై అధికారులు ఏమేర అంచనా వేశారో తెలియదు గానీ నిజానికి పంట పూర్తిగా దెబ్బతిన్నది. సాధారణ పరిహారం కాకుండా జరిగిన నష్టం మేర ప్రభుత్వం పరిహారం ఇస్తేనే రైతు కుటుంబాలు కోలుకోలేని పరిస్థితి నెలకొన్నది. అన్నదాతలు పరిహారం కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. ఈక్రమంలో విడుదలైన అన్నదాత సుఖీభవ సొమ్ము కూడా రైతు కళ్లలో ఆనందాన్ని తెప్పించలేకపోతోంది. పత్తికి ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న సాగు చేసుకొనేందుకు రైతులు సిద్ధమయ్యారు. ప్రభుత్వం ప్రత్యామ్నాయ పంటల సాగుకు సహకరించాల్సి ఉంది.

కమర్షియల్‌గా కాటన్ కార్పొరేషన్..

అనేక ఆటుపోటుల నడుమ పండిన కొద్ది పంటను అన్నదాతలు ఇంటికి చేర్చుకున్నారు. తుది దశ పత్తి తీసినా ఖర్చులకు చాలవన్న ఆలోచనతో పంట తొలగించడం ప్రారంభించారు. సీసీఐ మాత్రం అన్నదాతను ఆదుకొనే స్థితిలో కనిపించడం లేదు. నెల కిత్రం జిల్లాలో ఆరుచోట్ల కేంద్రాలు ఏర్పాటు చేసినా కొనుగోళ్లు చేపట్టడం లేదు. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో వరుస కథనాలతో స్పందించిన సీసీఐ ఎట్టకేలకు మంగళవారం కొద్ది మేర పత్తి కొనుగోలు చేసింది. తదుపరి నాణ్యమైన పత్తి మాత్రమే కొంటామంటూ నిబంధనలు విధిస్తూ అన్నదాతను అసహనానికి గురి చేస్తున్నది. ఇంత జరుగుతున్నా ప్రజాప్రతినిధులు స్పందించక పోవడంపై అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఆదుకుంటున్న తెలంగాణా చిరు వ్యాపారులు

నాణ్యత తగ్గిన పత్తిని స్థానిక వ్యాపారులు క్వింటాకు మూడు వేలు కూడా చెల్లించేందుకు ముందుకు రావడం లేదు. సీసీఐ ఆ పత్తిని కొనుగోలు చేసే పరిస్థితి కనిపించకపోవడంతో ఎంతకైనా తమకే ఇస్తారన్న ధీమాతో స్థానిక వ్యాపారులు రైతుల సహనాన్ని పరిక్షిస్తున్నారు. ఈ తరుణంలో తెలంగాణాకు చెందిన చిరు వ్యాపారులు జిల్లాలోని పలు ప్రాంతాలలో పత్తిని కొనుగోలు చేస్తున్నారు. ఆటోలపై వస్తున్న వ్యాపారులు ఆరు వేల రూపాయల వరకూ ధర చెల్లించి పత్తిని కొంటున్నారు. ఇప్పటికే సగానికిపైగా పత్తిని తెలంగాణా వ్యాపారులు కొనుగోలు చేశారు. సీసీఐ కంటే చిరువ్యాపారులే మేలని అన్నదాతలు అంటున్నారు.

'దివిసీమ ఉప్పెన'తో..

(5వ పేజీ తరువాయి)

మాట్లాడుతూ దివిసీమ పునర్నిర్మాణంలో భాగస్వాములైన మానవతామూర్తులను ఆహ్వానించి, వారందరిని సత్కరించుకోవటం గొప్ప అవకాశమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వైపరీత్యాల నిఘా సంస్థ మాజీ సభ్యుడు మర్రి శశిధర్‌రెడ్డి, రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి శితికానంద మహరాజ్, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, మాజీ ఎమ్మెల్యే పాటూరి రామయ్య, సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ, కాంగ్రెస్ నేత ఎన్.తలసీరెడ్డి, సీపీఎం జాతీయ నాయకులు మధు, రాష్ట్ర కార్యదర్శి వై.శ్రీనివాసరావు, దివిసీమ సోషల్ సొసైటీ నిర్వాహకులు ఫాదర్ అమల్ రాజ్, డాక్టర్ జి.సమరం, డాక్టర్ టి.నాగేంద్రస్వామి, సిహెచ్.సత్యనారాయణ, రెడ్‌క్రాస్ సంస్థ రాష్ట్ర చైర్మన్ వై.వి.రామారావు, లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ వి.వి.పి.ఎస్.ఆంజనేయులు, దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, బుద్ధప్రసాద్ తనయుడు మండలి వెంకట్రామ్ పాల్గొన్నారు.

ప్రతిఘటించి ఉంటే..

(5వ పేజీ తరువాయి)

చోటుచేసుకుని భారీనష్టం జరిగింది. తుపాకులు, భారీ పేలుడు పదార్థాలను కలిగి ఉన్న మావోయిస్టులు, వారిని అరెస్టు చేయడానికి వచ్చిన పోలీసులపై ఎదురుకాల్పులు జరిపితే భారీస్థాయిలో విధ్వంసం జరిగేదని కార్మికులు భయాందోళన వ్యక్తం చేశారు. ప్రమాదవశాత్తు వారి వద్ద ఉన్న పేలుడు పదార్థాలు పేలినా, ఊహించలేని ప్రమాదం జరిగి ఉండేదంటున్నారు. ఇదే రోడ్డులో ఉన్న యూనిట్లతో పాటు మారుతి భవనానికి వెనుక వైపున ఉన్న యూనిట్లలో కోట్లాది రూపాయల ఆస్తినష్టం జరిగేదనే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి ప్రతిఘటన చేయకుండా, మందుగుండు సామాగ్రిని ఉపయోగించకుండా మావోయిస్టులు లొంగిపోవడంతో కార్మికులు, యూనిట్ల యజమానులు ఊపిరి పీల్చుకున్నారు.

ఆ కాంట్రాక్టర్ ఎవరు?

(5వ పేజీ తరువాయి)

కాంట్రాక్టర్‌ను కలిసిందెవరు?

జీప్లస్‌త్రీ భవనంలో మూడో అంతస్తును అద్దెకు తీసుకున్నది కాంట్రాక్టర్ అని తేలడంతో అతనితో టచ్‌లో ఉన్న మావోయిస్టులు, మావోయిస్టు సానుభూతిపరులు ఎవరన్న దానిపై పోలీసులు కూపీ లాగుతున్నారు. ఈ భవనంలో తలదాచుకున్న మావోయిస్టుల్లో ఎక్కువ మంది గెరిల్లా గ్రూపునకు చెందినవారే. అటువంటి వారికి కాంట్రాక్టర్ ఆశ్రయం ఇప్పించడం ఇప్పుడు అనేక అనుమానాలకు తావిస్తోంది. కాంట్రాక్టర్‌కు ఎవరైనా అబద్ధం చెప్పి మావోయిస్టులను ఇక్కడికి తీసుకొచ్చారా అనే కోణంలో దర్యాప్తు సాగుతోంది. దర్యాప్తునకు సంబంధించిన ఏ చిన్న విషయాన్ని బయటకు పొక్కకుండా పోలీసులు ముందడుగు వేస్తున్నారు. మావోయిస్టులు ఆశ్రయం పొందిన భవనానికి మూడు కిలోమీటర్ల దూరంలో స్టేట్ ఇంటెలిజెన్స్ బ్యూరో కార్యాలయం ఉంది. దానికి సమీపంలోనే మావోయిస్టులు ఆశ్రయం పొందడం సంచలనంగా మారింది. మావోయిస్టు సానుభూతిపరులతో కాంట్రాక్టర్‌కు సంబంధాలు ఉన్నట్టు తెలుస్తోంది. వారు కాంట్రాక్టర్‌ను సంప్రదించడంతో ఆయన మూడో అంతస్తును అద్దెకు తీసుకున్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం ఆ కాంట్రాక్టర్ పరారీలో ఉన్నాడు. అతడి కోసం పోలీసు ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి.

శ్రీరామపాదక్షేత్రంలో..

(5వ పేజీ తరువాయి)

అభిషేక క్రతువు సందర్భంగా వేదమంత్రోచ్ఛరణల ప్రభావమేనని భక్తులు నమ్ముతుండగా, కార్తీకమాసం అంటే కృష్ణానదికి వరదలు పూర్తయి సముద్రపు ఉప్పునీరు పోటు రూపంలో ఎగదన్నే సందర్భంలో ఉప్పునీటి బారిన పడకుండా మంచినీటిలోకి వచ్చేందుకు నీటిలో జీవించే సర్పాలు సహజసిద్ధంగా వచ్చే వలస అని విమర్శకులు అంటున్నారు. ఏదిఏమైనా గడిచిన రెండు రోజులుగా రాత్రి ఆరున్నర నుంచి అభిషేకాది క్రతువులు పూర్తయ్యే సమయం వరకూ దాదాపు రెండు గంటల వరకూ సర్పాలు చేసే విన్యాసాలు చూపరులను అలరిస్తున్నాయి. రాత్రి తెల్లవార్లూ వెలుగులు కొనసాగుతున్నప్పటికీ ఆ పాములు అభిషేకాది కార్యక్రమాలు పూర్తయిన కొద్దిసేపటికే తిరిగి వెళ్లిపోవటం దేవుడి మహిమ కాక మరేమిటని భక్తులు అంటున్నారు.

ప్రతిపాదనలతోనే సరి..

(5వ పేజీ తరువాయి)

మెడికల్ కళాశాలకు వెళ్లేందుకు ఇబ్బంది లేకుండా రైల్వేట్రాక్‌పై ఫ్లైఓవర్ నిర్మాణానికి రూ.25 కోట్లు కేటాయిస్తున్నట్లు 2022, మేలో మచిలీపట్నం పోర్టు నిర్మాణ పనులను ప్రారంభించేందుకు వచ్చిన సమయంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రకటించారు. రైల్వేట్రాక్‌పై ఫ్లైఓవర్ నిర్మాణం చేయాలంటే రైల్వేశాఖ అధికారులు అనుమతులు ఇచ్చి వారి పర్యవేక్షణలోనే నిర్మాణం జరగాలని మెడికల్ కళాశాల అధికారులు చెబుతున్నారు. అయితే ఇంతవరకు రైల్వేశాఖ అధికారులు ఈ ప్రాంతానికి వచ్చి పరిశీలన చేసిన దాఖలాలే లేవు. భూమిని సర్వే చేసి విడగొట్టిందిలేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వద్ద రైల్వేట్రాక్‌పై ఫ్లైఓవర్ నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు ఉన్నా అవి కాగితాలకే పరిమితమయ్యాయి.

వైద్య సేవలు ఎప్పటినుంచో?

ప్రస్తుతం మెడికల్ కళాశాలలో 150 మంది విద్యార్థులు ఎంబీబీఎస్ కోర్సు మూడో సంవత్సరం తరగతులు ప్రారంభమయ్యాయి. మెడికల్ కళాశాలలో అత్యవసర వైద్యసేవలు ఇప్పటికే ప్రారంభించాల్సి ఉంది. మెడికల్ కళాశాలలో ఇన్‌పేషెంట్, అవుట్ పేషెంట్లకు వైద్య సేవలు అందించేందుకు భవనాలు సిద్ధం కాకపోవడంతో వైద్యసేవలు ప్రారంభించలేదు. వచ్చే ఏడాది నాటికి ఈ భవనాలు అందుబాటులోకి వస్తే ఇక్కడే అత్యవసర వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయి. అత్యవసర వైద్యసేవలు పొందేవారు మెడికల్ కళాశాలకు వచ్చే సమయంలో రైల్వేట్రాక్ వద్ద గేటు పడితే వారి పరిస్థితి ఏమిటనేది ప్రశ్నార్థకంగా మారింది. రైల్వేట్రాక్‌పై ఫ్లైఓవర్ నిర్మాణం జరిగే వరకు ప్రసూతి, గుండె జబ్బులు, ఇతర అత్యవసర వైద్యసేవలు మెడికల్ కళాశాలలో ప్రారంభించే అవకాశం లేదని వైద్యాధికారులు చెబుతున్నారు.

రెచ్చిపోతున్న రేషన్ డాన్

(5వ పేజీ తరువాయి)

మారుతున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక రేషన్ పంపిణీని ఆన్‌లైన్ ద్వారా పర్యవేక్షిస్తోంది. పంపిణీ శాతాలను గమనిస్తూ తగ్గిన చోట డీలర్లను ప్రశ్నిస్తోంది. ఈ-పోస్ వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా అడుగులు వేస్తోంది. ఇందుకోసం సరికొత్త స్మార్ట్ ఈ-పోస్ యంత్రాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. స్మార్ట్ రైస్ కార్డులను ప్రవేశపెట్టారు. రానున్న రోజుల్లో రైస్ ఏటీఎంలను ఏర్పాటుచేసే దిశగా అడుగులు వేస్తున్న తరుణంలో రేషన్ డాన్ల కారణంగా ప్రజా పంపిణీ వ్యవస్థకు మకిలీ పడుతోంది.

విజయవాడ నగరం సహా ఉమ్మడి కృష్ణాజిల్లాలో రేషన్ డీలర్లు కార్డుదారుల నుంచి రేషన్‌ను కొంటుంటారు. అలా కొన్న బియ్యాన్ని తమకే విక్రయించాలని ఎక్కడికక్కడ డాన్‌లు శాసిస్తున్నారు. కార్డుదారుల నుంచి కేజీ బియ్యం రూ.14, రూ.15కు రేషన్ డీలర్లు కొంటున్నారు. ఈ బియ్యాన్ని రూ.20కు సాధారణ రేషన్ సిండికేట్‌కు విక్రయిస్తారు. నియోజకవర్గ రేషన్ డాన్లు మాత్రం రూ.15, రూ.16కు తమకే అమ్మాలని రేషన్ డీలర్లను ఒత్తిడి చేస్తున్నారు. ఇలా చేస్తే డీలర్లకు కేజీకి రూపాయే వస్తుంది. తమకు లాభం రాదన్న ఉద్దేశంతో డీలర్లు బయటకు అమ్మే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలో డీలర్లను డాన్లు భయపెడుతున్నారు. లొంగకపోతే వ్యవస్థలను ఉసి గొలుపుతున్నారు. డీలర్ల లొసుగులను బయటపెట్టి సివిల్ సప్లయిస్ అధికారులతో 6ఏ కేసులు నమోదు చేయిస్తున్నారు. అవినీతి విజిలెన్స్ అధికారులను రంగంలోకి దించి దాడులు చేయిస్తున్నారు. దీంతో చాలామంది డీలర్లు భయపడి రేషన్ బియ్యాన్ని ఆ డాన్లకే విక్రయిస్తున్నారు.

4 గంటల్లోనే ధాన్యం బిల్లులు

(5వ పేజీ తరువాయి)

ఆర్ఎస్‌కేలు, రైస్‌మిల్లుల్లో తేమశాతం కొలిచే యంత్రాలు ఒకే కంపెనీకి చెందినవి పెట్టామని చెప్పారు. తేమశాతంలో తేడాలు రాకుండా, రైతులు నష్టపోకుండా ఆర్ఎస్‌కేలు, మిల్లుల్లో ఉన్న తేమశాతం కొలిచే యంత్రాలను బ్లూటూత్ ద్వారా అనుసంధానం చేశామన్నారు. ధాన్యం రవాణా చేసేందుకు వాహనాలను కూడా అందుబాటులో ఉంచామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఏడాది 51 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేసేలా ప్రణాళికలు రూపొందించామని చెప్పారు. 6.52 కోట్ల గోనె సంచులను అందుబాటులో ఉంచామని తెలిపారు. మిల్లర్లు ధాన్యం కొనుగోలులో ప్రభుత్వానికి సహరించాలని కోరారు.

వర్షంపై రైతులు అప్రమత్తంగా ఉండాలి

ఈ నెల 24, 25 తేదీల్లో వర్షం పడుతుందనే వాతావరణశాఖ హెచ్చరికలు నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి నాదెండ్ల సూచించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వరి కోతలు పూర్తి చేసి ధాన్యం సురక్షిత ప్రాంతాలకు చేర్చుకోవాలని చెప్పారు. కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 190 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. 5,334 మంది రైతుల నుంచి 40 వేల టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ టి.శివరాంప్రసాద్, ఉయ్యూరు ఆర్డీవో బీఎస్ హేలా షారోన్, మచిలీపట్నం ఆర్డీవో కె.స్వాతి పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్‌బర్డ్	130, 139, 150
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 660

యువతకు ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యం: ఎమ్మెల్యే యార్లగడ్డ

గన్నవరం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యమని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. మండలంలోని వీరపనేనిగూడెం టీడీపీ ఆధ్వర్యంలో బుధవారం మామిడి తోటలో కార్తీక వన సమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు స్థాని కంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిం చేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నట్లు చెప్పారు. నిరుద్యోగ యువత సొంత గ్రామాలకు దూరంగా పట్టణాల్లో చాలీచాలని వేతనంతో జీవిస్తున్నారని అలాంటి వారికి స్థానికంగానే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తే వారి కుటుంబాలు బాగుపడటంతో పాటు, గ్రామాలు సైతం అభివృద్ధి చెందుతాయన్నారు. టీడీపీ మండల అధ్యక్షులు గూడపాటి తులసి మోహన్, కార్యదర్శి బోడపాటి రవి, గన్నవరం ఇన్చార్జి సర్పంచ్ పాలడుగు వెంకటరామవరప్రసాద్ (నాని), ఎంపీటీసీ పడమట రంగారావు తదితరులు పాల్గొన్నారు.



వైవీబీని సత్కరిస్తున్న సగర వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్లు గజ్జల గణేశ్, తాడిశెట్టి వీరాస్వామి

మర్యాదపూర్వక కలయిక

● వైవీబీని కలిసిన సగర కార్పొరేషన్ డైరెక్టర్లు

ఉయ్యూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్‌ను సగర వెల్ఫేర్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్లు గజ్జల గణేశ్, తాడిశెట్టి వీరాస్వామి బుధవారం కలిశారు. కార్పొరేషన్ డైరెక్టర్లుగా నియ మితులైన సందర్భంగా రాజేంద్రప్రసాద్‌ను ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా ఇరువురు కలసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ, పార్టీలో కష్టపడి పనిచేసిన వారికి కూటమి ప్రభుత్వం తప్పకుండా న్యాయం చేస్తుందన్నారు. పార్టీ నాయకులు రాజులపాటి పణి, అజ్మతుల్లా, జంపాన వీరశ్రీనివాసరావు పాల్గొన్నారు.

22నుంచి ఆక్యుపంక్చర్ యోగాపై శిక్షణ

కానూరు, నవంబరు19(ఆంధ్రజ్యోతి): కానూరు అశోక్ నగర్‌లోని ఇండియన్ ఓం కేంద్ర కార్యాలయంలో ఆక్యుపంక్చర్ యోగా విధానంపై ఈ నెల 22నుంచి 28వ తేదీ వరకు వారం రోజులపాటు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఇండియన్ ఓం కేంద్ర కార్యాలయం చైర్మన్, కోర్సు ప్రిన్సిపాల్, డైరెక్టర్ డాక్టర్ మకాల సత్యనారాయణ చెప్పారు. బుధవారం ఆయన కానూరులోని తన కార్యాలయంలో విలేఖరులతో మాట్లాడుతూ, భారత ప్రభుత్వ ప్రోత్సాహంతో భారత్ సేవక్ సమాజ్(బీఎస్ఎస్) సమన్వయంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తునట్లు తెలిపారు. శిక్షణ కార్యక్రమం పూర్తి అయిన తరువాత ఏపీ ప్రభుత్వ ఖాదీ బోర్డు నుంచి సర్టిఫికెట్‌లు కూడా అందజేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈమేరకు ఏపీ ఖాదీ బోర్డుతో ఒప్పందం కూడా కుదుర్చుకున్నామని డాక్టర్ సత్యనారాయణ కోరారు. మరిన్ని వివరాలకు 9000347369 నెంబరును సంప్రదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

సిద్ధార్థ వర్సిటీలో అంతర్జాతీయ పురుషుల దినోత్సవం

కానూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కానూరులోని సిద్ధార్థ డీమ్డ్ యూని వర్సిటీలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ పురుషుల దినోత్సవం- 2025 జరిగింది. ఈ సందర్భంగా సమాజంలో పురుషులు పోషించవలసిన పాత్ర, బాధ్యతలను గురించి ఎన్ఎస్ఎస్ అధికారులు విద్యార్థుల్లో అవగాహన కల్పించారు. విద్యార్థులకు వకృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. విద్యార్థులు, యువకుల పాత్ర, బాధ్యతలపై వాలంటీర్లు చర్చించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు వేణుగోపాల్‌రెడ్డి, డాక్టర్ జె. శివరాంప్రసాద్‌తో పాటు వాలంటీర్లు పాల్గొన్నారు.



అభయాంజనేయస్వామి దేవస్థానం వద్ద పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సంకలనకర్త దాసరి పూర్ణచంద్రరావు

నూరు వసంతాల జంక్షన్ చరిత్ర పుస్తకావిష్కరణ

హనుమాన్‌జంక్షన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): నేటి యువతరానికి హనుమాన్‌జంక్షన్ పుట్టుపూర్వోత్తరాలు తెలియజేయాలనే సంకల్పంతో పుస్తకాన్ని తీసుకురావడం జరిగిందని రంగస్థల కళాకారుడు రక్తకన్నీరు నాటకం ఫేమ్ దాసరి పూర్ణచంద్రరావు తెలిపారు. బుధవారం స్థానిక అభయాంజనేయ స్వామి దేవస్థానంలో నూరు వసంతాల హనుమాన్‌జంక్షన్ చరిత్ర పుస్తకం ఆవిష్కరణ కార్యక్రమం ఆ పుస్తక సంకలనకర్త దాసరి పూర్ణచంద్ర రావు నిర్వహించారు. ముందుగా పుస్తక రచయిత నర్రా సూర్యప్రకాశరావు, స్థానిక జ్యోతిష్యం, వాస్తు సిద్ధాంతి రొంపెల్లి భగవాన్‌లు పుస్తకాన్ని అభయాంజనేయస్వామి పాదాలు వద్ద పెట్టి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వెంకటేశ్వర థియేటర్ పూర్వపు యజమాని మానేపల్లి కుమార్, సుధా రాణి, పుస్తక ప్రోత్సాహక కర్త బోయిపాటి ప్రసాద్, సునీత దంపతులు, మణి ప్రింటర్స్ యజమాని గోళ్ల వెంకట్రావు, మాజీ సర్పంచ్ దన్నే దుర్గారావు, లయన్స్ క్లబ్ నాయకులు తాడి రంగారావు, వి.త్రివేణి, మాణిక్యాలరావు, గంటా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై అపరాలు

ఉంగుటూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్ వరిమాగాణుల్లో రెండవ (రబీ) పంటగా సాగుచేసేందుకు అనువైన అపరాల విత్తనాలను ప్రభుత్వం 30 శాతం సబ్సిడీపై రైతులకు అందుబాటులో వుంచినట్లు ఏవో గద్దె రమేష్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ప్రస్తుతం సార్వా వరికోతలు ఊపందుకున్న నేపథ్యంలో రెండోపంటగా విత్తేందుకు 20 క్వింటాళ్ల మినుములు, 15 క్వింటాళ్ల పచ్చపెసలు రైతుసేవాకేంద్రంలో అందుబాటులో వున్నాయన్నారు.

శివాలయంలో అన్నాభిషేకం

కానూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం పురస్కరించుకొని కానూరులోని శివాలయంలో స్వామివారికి బుధవారం అన్నాభిషేకం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శివునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఆలయం పూజారులు ఫణి, కృష్ణఫణిలు స్వామివారికి పూజా క్రతువులు నిర్వహించారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

కంకిపాడు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలం లోని తెన్నేరుకు చెందిన వ్యక్తి కనిపించడం లేదంటూ వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. తెన్నేరుకు చెందిన కొండవీటి గోపి కృష్ణ (40) రెండు రోజుల క్రితం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో బంధువుల ఇళ్లలో విచారించిన అనంతరం కంకిపాడు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

రైతుకు అండగా ప్రభుత్వం

● జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్
● సాగుకు చేయూతగా అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకం రెండో విడత నిధులు విడుదల
● ప్రకృతి వ్యవసాయం చేయాలి: కలెక్టర్



అన్నదాత సుఖీభవ చెక్కును రైతులతో కలిసి విడుదల చేస్తున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, కలెక్టర్ డి.కె.బాలాజీ

హనుమాన్‌జంక్షన్‌రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రైతులకు సాగులో ఆర్థిక ఇబ్బందుల దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేకపోయినా అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేస్తున్నామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. వీరవల్లిలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకం రెండవ విడత నిధులను ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు, కలెక్టర్ డీకే బాలాజీలతో కలిసి బుధవారం రైతులకు చెక్కు అందజేసి విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రూ.6వేలకు తోడుగా రాష్ట్రప్రభుత్వం రూ.14 వేలు కలిపి ఏడాదికి మూడు విడతలుగా అందజేస్తున్నామన్నారు. కేంద్ర ప్రభు త్వం నిధులు విడుదల చేసిన రోజునే రాష్ట్రప్రభుత్వం కూడా విడుదల చేసి రైతులకు అండగా ఉండేలా పెట్టుబడి సాయం అందించడం జరుగుతున్నదని మంత్రి సుభాష్ అన్నారు. వైసీపీ ప్రభుత్వం రూ.13,500 మాత్రమే ఇస్తే అన్నదాతలకు అండగా ఉండాలని కూటమి ప్రభుత్వం రూ.20వేలు ఇస్తున్నదని ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారులు సునీల్, కె.శ్రీనివాస్, జ్యోతిరమణి, రంగనాథ్‌బాబు, రమేష్, శివప్రసాద్, జె.జ్యోతి, జోసఫ్, ఆర్డీఓ బాలసుబ్రహ్మణ్యం, ఏఎంసీ చైర్మన్ గూడవల్లి నరసింహారావు, తహసీల్దార్ మురళీకృష్ణ, ఎంపీడీవో జోగేశ్వరరావు, కుమార స్వామి, చలమలశెట్టి రమేష్‌బాబు, ఆళ్ల గోపాలకృష్ణ, దయాల రాజేశ్వరరావు, మూల్పూరి సాయికళ్యాణి, చిరుమామిళ్ల సూర్యం పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే కూటమి లక్ష్యం : ఎమ్మెల్యే బోడె ప్రసాద్



అన్నదాత సుఖీభవ రెండవ విడత నిధులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు: రైతు సంక్షేమమే కూటమి ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. పోరంకి సొసైటీ వద్ద నిర్వహించిన అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ రెండవ విడత నిధులు పంపిణీ కార్యక్రమంలో బుధవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ, పెనమలూరు నియోజకవర్గంలో సుమారు 8,013 మందికి అన్నదాత, పీఎం కిసాన్‌పథకం ద్వారా సుమారు 7067 మంది రైతుల ఖాతాల్లో రూ. 5.42 కోట్లు జమ అవుతున్నాయన్నారు. రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేసి రైతులకు 24 గంటలలోపే రైతు ఖాతాల్లో డబ్బులు జమఅవుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మంచినేని పరమేష్, అనుమోలు ప్రభాకర్, కొండా ప్రవీణ్, అన్నే ధనయ్య, సంగెపు రంగారావు, మారుపూడి ధనరామకోటేశ్వరరావు, యార్లగడ్డ సుచిత్ర, ఏవో శైలజ, ఉషా తదితరులు పాల్గొన్నారు.



గండిగుంట రైతుసేవా కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యే బోడె ప్రసాద్

ప్రతి ధాన్యపు గింజ కొంటాం

పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

ఉయ్యూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. గండిగుంట రైతు సేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌తో కలసి బుధవారం సందర్శించి రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జిల్లాలో ఈ నెల ఆఖరినాటికి లక్ష మెట్రిక్ టన్నులు, వచ్చే నెలకు 7లక్షల 90వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలన్నది లక్ష్యంగా నిర్దేశించామన్నారు. ఈ నెల 24, 25 తేదీల్లో వాతవరణంలో మార్పులు కనపడే అవకాశం ఉందని సమాచారం అందిస్తున్న నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండి ఈ వారం రోజుల్లో పూర్తి చేయాలన్నారు. మార్కెటింగ్, పౌరసరఫరాల అధికారులు పాల్గొన్నారు.

డీలర్లకు కమిషన్ పెంచాలి

వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దకే నిత్యావసర సరుకులు పంపిణీ వల్ల రేషన్ డీలర్ల పనిదినాలు పెరగడంతో పాటు వ్యయం పెరిగిన పరిస్థితుల్లో క్వింటాకు ఇచ్చే కమిషన్ రూ. 300కు పెంచాలని రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కోరింది. సంఘం అధ్యక్షుడు కాగిత కొండ, జిల్లా కోశాధికారి నవీన్ కుమార్, కార్యదర్శి ఏసుబాబు, ఉయ్యూరు ఉపాధ్యక్షుడు పి.వెంకటేశ్వరరావు ధనుంజయ బుధవారం గండిగుంటలో మంత్రిని కలసి వినతిపత్రం అందజేశారు.

వాస్తవ సాగుదారులకే అన్నదాత సుఖీభవ ఇవ్వాలి

కంకిపాడు : వాస్తవ సాగుదారులకే అన్నదాత సుఖీభవ చెల్లించాలని కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి పంచకర్ల రంగారావు అన్నారు. స్థానిక మండేపూడి నాగభూషణరెడ్డి భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎన్నికల ప్రచారంలో అన్నదాత సుఖీభవ పథకాన్ని కౌలు రైతులకు అందే విధంగా చర్యలు తీసుకుం టామంటూ ఎన్నికల వాగ్దానం చేయడం జరిగిందన్నారు. కౌలు రైతు సంఘం జిల్లా కమిటి సభ్యులు టి. నరేష్ పాల్గొన్నారు.



ఉంగుటూరు జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేస్తున్న కలెక్టర్ బాలాజీ

ఉన్నత ఆశయాలు, లక్ష్యాలు కలిగి ఉండాలి

విద్యార్థులతో కలెక్టర్ డీకే బాలాజీ

ఉంగుటూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులందరూ ఉన్నతమైన ఆశయాలు, లక్ష్యాలను కలిగివుండి క్రమశిక్షణ, పట్టుదలతో ప్రణాళికాబద్ధంగా చదవటంద్వారా వాటి సాధనకు కృషి చేయాలని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. ఉంగుటూరులోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. అధికారులతో కలిసి ప్రాంగణమంతా కలియ తిరిగిన కలెక్టర్ మధ్యాహ్న భోజన పథకం పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం పెడుతున్నారా, లేదా అని పాఠశాల యాజమాన్యాన్ని ఆరా తీశారు. మెనూ ప్రకారమే ఆహారం సిద్ధం చేసి పెడుతున్నామని పాఠశాల హెచ్ఎం చేరగుడి అనిత సమాధానం ఇచ్చారు. ఈక్రమంలో విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేసిన కలెక్టర్ వారితో కాసేపు ముచ్చటించారు. అనంతరం విద్యార్థులకు స్ఫూర్తిదాయకమైన సందేశమిచ్చారు. కలెక్టర్ వెంట డీవైఈవో కొండా రవికుమార్, ఎంపీడీవో ఇ.సత్యకుమార్, ఎంఈవో-2 జె.సాంబశివరావు, పాఠశాల హెచ్ఎం అనిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు వున్నారు.

సహకార రంగం బలోపేతం

జిల్లా కో-ఆపరేటివ్ అధికారి ఎస్. శ్రీనివాసరెడ్డి

విజయవాడ రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం సహకార రంగాన్ని బలోపేతం చేయడానికి అగ్రికల్చరల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫెసిలిటీ పేరుతో రూ. 20 లక్షల కోట్లు పెట్టుబడి పెట్టిందని జిల్లా కో-ఆపరేటివ్ అధికారి ఎస్. శ్రీనివాసరెడ్డి అన్నారు. 72వ అఖిల భారత సహకార వారోత్సవాలు బుధవారం నున్నలో జరిగాయి. స్థానిక సొసైటీ వద్ద జరిగిన ఈ కార్యక్రమానికి శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో ముందుగా సహకార రంగంలో రుగ్మతలను రూపుమాపి ఆర్థిక వ్యవస్థను పెంపొందించిన భారత తొలి ప్రధాని పండిట్ నెహ్రూ కృషిని కొనియాడుతూ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నున్న సొసైటీ చైర్మన్ కలకోటి శ్రీనివాసరెడ్డి, డైరక్టర్లు గంపా శ్రీనివాస్, పామర్తి శ్రీను, డివిజనల్ ఆఫీసర్ కిరణ్‌కుమార్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ ధర్మారావు పాల్గొన్నారు.

సిద్ధార్థలో పోస్టర్ ఆవిష్కరణ

ఇన్నోవేషన్.. డిజైన్‌పై నేటి నుంచి రెండు రోజుల వర్క్‌షాప్

కానూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఇన్నోవేషన్.. డిజైన్.. ఎంటర్‌ప్రెన్యుర్‌షిప్ థీమ్‌తో రెండు రోజులపాటు కానూరులోని సిద్ధార్థ డీమ్డ్ యూనివర్సిటీలో కెపాసిటీ బిల్డింగ్ వర్క్‌షాప్ జరగనుంది. గురు, శుక్రవారాల్లో రెండు రోజల పాటు జరిగే ఈ వర్క్‌షాప్‌కు సంబంధించిన పోస్టర్‌ను బుధవారం వర్సిటీలో జరిగిన కార్యక్రమంలో ప్రో. వీసీ ఏవీ రత్నప్రసాద్, రీసర్చ్, టెక్నాలజీ డెవలప్‌మెంట్ డీన్ ప్రొఫెసర్ ఎం. సునీత, రిజిస్ట్రార్ ఎం. రవిచంద్, ప్రొఫెసర్‌లు వెంకట్రావు, వి. మల్లికార్జున్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రో. వీసీ రత్నప్రసాద్ విలేఖరులతో మాట్లాడుతూ ఈ వర్క్‌షాప్‌కు రాష్ట్రంలోని 26 జిల్లా నుంచి డీఈవోలు, డైట్ కళాశాలల ప్రిన్సిపాల్స్, ఎస్ఈఆర్‌టీ సభ్యులు హాజరువుతారని తెలిపారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి


గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా జరిగిన మహిళా సాధికారతపై అవగాహన సదస్సులో గన్నవరం న్యాయాధికారిణి నీరజ



గన్నవరం గ్రంథాలయంలో మాట్లాడుతున్న న్యాయాధికారిణి నీరజ.. తేలప్రోలు గ్రంథాలయంలో

గన్నవరం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే మహిళా సాధికారత సాధించినట్లు అని గన్నవరం న్యాయాధికారిణి నీరజ అన్నారు. స్థానిక గ్రేడ్-1 గ్రంథాలయంలో 58వ వారోత్సవాల్లో భాగంగా బుధవారం మహిళల సాధికారతపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఎస్జీజీ నీరజ మాట్లాడుతూ, మహిళల హక్కుల గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన అవశ్యకత ఉందన్నారు. జడ్పీటీసీ సభ్యురాలు ఏఈ రాణి మాట్లాడుతూ, మహిళలకు సమాన హక్కుల కోసం ఇందిరాగాంధీ విశేష కృషి చేసి ఎన్నో సంస్క రణలను తీసుకువచ్చారన్నారు. మధ్యాహ్నం విద్యార్థులకు రంగవల్లులు పోటీలు నిర్వహించారు. అభివృద్ధి కమిటీ అధ్యక్షులు నర్రా సీతారామారావు, దుగ్గిరాల ఝాన్సీరాణి, పడమట శోభారాణి, లైబ్రేరియన్ కె.నాగరాజు తదితరులు పాల్గొన్నారు. ముస్తాబాద, పురుషోత్తపట్నం గ్రంథాలయాల్లో పోటీలు నిర్వహించారు. లైబ్రేరియన్‌లు కె.జ్యోతికుమారి, సుంకర నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఉంగుటూరు : పుస్తక పఠనంతో విద్యార్థుల్లో విజ్ఞానాభివృద్ధి, మనోవికాసం పరిఢవిల్లుతుందని తేలప్రోలు ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ లక్ష్మీ సౌజన్య అన్నారు. 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం మండలంలోని తేలప్రోలు, ఆత్కూరు, ఉంగుటూరు, మానికొండ గ్రంథాలయాల్లో భారత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్లు కె.కృపానందం, బీవీ కృష్ణారావు, యు.చంద్రశేఖర్, ఎల్.హరికృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఏజీ అండ్ ఎస్‌జీఎస్‌లో పుస్తక ప్రదర్శన

హనుమాన్‌జంక్షన్: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం బాపులపాడు శాఖ గ్రంథాలయాధికారి సుబ్రహ్మణ్యేశ్వరరావు ఆధ్వర్యంలో బాపులపాడు జడ్పీ హైస్కూల్ విద్యా ర్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఎం.శ్రీనివాసరావు, ఉపాధ్యా యులు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యూరు: అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని పెద ఓగిరాల శాఖా గ్రంథాలయంలో బుధవారం భారత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ చిత్రపటానికి గ్రామసర్పంచ్ త్రిపురం లక్ష్మి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం హైస్కూల్, ఎంపీ యూపీ స్కూల్ విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు స్వరూపరాణి, వి.పద్మజ, గ్రంథాలయాధికారి కాకాని రమేష్‌బాబు, శ్రీనివాసరావు పాల్గొన్నారు. ● ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళాశాలలో గ్రంథాలయ వారోత్సవాలు పురస్కరించుకుని బుధవారం విశ్రాంత ప్రిన్సిపాల్ ఎం.వేణుగోపాల్ ఆధ్వర్యంలో పుస్తకప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో ముఖ్య అతిథిగా నూకల సాంబశివరావు, ప్రిన్సిపాల్ శివనాథ్, ప్రత్యేక అధికారి సత్యనారాయణ, వినయ్‌కుమార్ అధ్యాపకులు పాల్గొన్నారు. ఉయ్యూరు శాఖా గ్రంథాలయంలో బుధవారం మహిళలు, విద్యార్థినులకు ముగ్గుల పోటీ లు నిర్వహించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించి చేయూత ఫౌండేషన్ చైర్మన్ పి.కృష్ణకుమారిని సత్కరించారు. సంఘ సేవకురాలు వీరకుమారి, కౌన్సిలర్ వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. గ్రంథాలయ అధికారి రమణి పర్యవేక్షించారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్: మహిళల శక్తి సామర్థ్యాలు చాటే క్రమంలో ఝాన్సీలక్ష్మీబాయి, ఇందిరాగాంధీలోని తెగువను స్ఫూర్తిగా తీసుకోవాలని మాజీ సర్పంచ్ చితంల వెంకట శివ అప్పారావు, డాక్టర్ వాహిని సూచించారు. కానుమోలు గ్రంథాలయాధికారి రహీం ఆధ్వ ర్యంలో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం ఝాన్సీలక్ష్మీబాయి, ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా చిత్రపటాలకు నివాళులర్పించారు. రచయిత్రి నూకల సత్యవతి, హెచ్ఎం ధనలక్ష్మి, సుంకర సాంబశివరాయల్ పాల్గొన్నారు.



స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు దత్తాత్రేయకు అందిస్తున్న ఈవో శ్రీరామ వరప్రసాదరావు

సుబ్బారాయుడి సన్నిధిలో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ

మోపిదేవి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, జాతీయ ప్రకృతి వైపరీత్యాల నిఘా సంస్థ మాజీ సభ్యులు మర్రి శశిధర్ రెడ్డి మోపిదేవిలోని శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాన్ని బుధవారం ఉదయం దర్శించుకున్నారు. అధికారులు, అర్చక బృందం వారికి ఆలయ మర్యాదలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. నాగపుట్టలో పాలుపోసి స్వామిని దర్శించుకున్నారు. అర్చక బృందం వేదమంత్రాలతో ఆశీర్వచనం పలుకగా, ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు శేషవస్త్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదాలు అందించారు. జనసేన నేతలు మండలి వెంకట్రామ్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి చిరువోలు బుచ్చిరాజు వీరి వెంట ఉన్నారు.

రావివారిపాలెంలో అల్పాహార విందు

మోపిదేవి పంచాయతీ శివారు రావివారిపాలెం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నేత పరుచూరి అంజయ్య, పీఏసీఎస్ అధ్యక్షుడు పరుచూరి శ్రీనివాసరావు ఇంటి వద్ద ఏర్పాటు చేసిన అల్పాహార విందుకు హాజరైన మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, శశిధర్ రెడ్డికి వారు ఘన స్వాగతం పలికారు. అల్పాహార విందు అనంతరం వారిని దుశ్శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. జనసేన నేతలు మండలి వెంకట్రామ్, మోపిదేవి పంచాయతీ ఉపసర్పంచ్ కోనేరు సుందర్ సింగ్, తెలుగు యువత నేతలు కొల్లి మురళీకృష్ణ, గద్దె శ్రీహరి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి చిరువోలు బుచ్చిరాజు పాల్గొన్నారు.

సఫాయి కర్మచారి వృత్తిదారులకు సబ్సిడీపై వాహనాలు

మచిలీపట్నం టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సఫాయి కర్మచారి వృత్తిదారులకు సబ్సిడీపై వాహనాలు అందిస్తున్నట్టు జిల్లా సాంఘిక సంక్షేమాధికారి షాహీద్‌బాబు తెలిపారు. సెప్టింక్ ట్యాంక్ క్లీనింగ్ వాహనాల మంజూరుకు నిరుద్యోగ యువత దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వాహనం రూ. 31,67,322 అని, అందులో రూ. 14,16,831 సబ్సిడీ లభిస్తుందన్నారు. మిగిలిన రూ. 17,50,434ను రుణంగా పొందవచ్చన్నారు. ఐదుగురు కలిసి గ్రూపుగా ఏర్పడి రుణం తీసుకోవాలన్నారు. వివరాలకు 9652057244కు ఫోన్ చేయవచ్చన్నారు.

టెన్త్ పబ్లిక్ పరీక్షలకు సకాలంలో ఫీజు చెల్లించండి

మచిలీపట్నం టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న టెన్త్ పబ్లిక్ పరీక్షలకు ఈనెల 25లోగా పరీక్ష ఫీజు చెల్లించాలని డీఈవో రామారావు తెలిపారు. ప్రధానోపాధ్యాయులు విద్యార్థుల నుంచి వసూలు చేసిన ఫీజును సకాలంలో చెల్లించాలన్నారు. మాన్యువల్ కాకుండా వెబ్‌సైట్‌లో నామినల్ రోల్స్ ఉంచాలన్నారు. రెగ్యులర్ విద్యార్థులకు అన్ని సబ్జెక్టులు కలిపి రూ.125, 3 కన్నా ఎక్కువ హాజరయ్యేవారికి రూ.125, 3 సబ్జెక్టుల వరకు రూ.110 చెల్లించాలన్నారు. వయసు మాఫీ రుసుము రూ.300 చెల్లించాలన్నారు.



ఏపీ రెడ్‌క్రాస్ చైర్మన్ రామారావు, ఎన్టీఆర్ జిల్లా చైర్మన్ డాక్టర్ సమరంను సన్మానిస్తున్న డాక్టర్ డీఆర్‌కే ప్రసాద్ దంపతులు, రెడ్‌క్రాస్ ప్రతినిధులు

రాష్ట్రమంతటా స్వచ్ఛ చల్లపల్లి స్ఫూర్తి

● ఐఆర్‌సీఎస్ ఏపీ చైర్మన్ రామారావు

చల్లపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్ఫూర్తిమంతంగా సాగుతున్న స్వచ్ఛ చల్లపల్లి అభినందనీయమనీ, ఈ స్ఫూర్తి రాష్ట్రమంతటా వ్యాపించాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆంధ్రప్రదేశ్ చైర్మన్ వైడీ రామారావు అన్నారు. ఐఆర్‌సీఎస్ ఎన్టీఆర్ జిల్లా చైర్మన్ డాక్టర్ జీ సమరంతో కలిసి బుధవారం చల్లపల్లి గ్రామాన్ని సందర్శించారు. కృష్ణా జిల్లా ఐఆర్‌సీఎస్ చైర్మన్, స్వచ్ఛ చల్లపల్లి రథసారథి డాక్టర్ డీఆర్‌కే ప్రసాద్ వారికి స్వాగతం పలికారు. డీఆర్‌కే నివాసంలో స్వచ్ఛ చల్లపల్లి ఉద్యమ ప్రస్థానాన్ని పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తిలకించారు. అనంతరం రామారావు మాట్లాడుతూ డాక్టర్ డీఆర్‌కే ప్రసాద్ - డాక్టర్ పద్మావతి దంపతుల నేతృత్వంలో 11 ఏళ్ల స్వచ్ఛ చల్లపల్లి ప్రస్థానాన్ని, స్వచ్ఛ కార్యకర్తల సేవాభావాన్ని అభినందించారు. కృష్ణా జిల్లాలో రెడ్‌క్రాస్ సేవల గురించి, సబ్‌బ్రాంచ్‌ల ఏర్పాటు తదితర విషయాలపై ఐఆర్‌సీఎస్ చైర్మన్ డాక్టర్ డీఆర్‌కే ప్రసాద్‌తో చర్చించారు. అనంతరం రామారావు, డాక్టర్ సమరంను డీఆర్‌కే-పద్మావతి దంపతులు, ఎంసీ సభ్యులు సన్మానించారు. కృష్ణాజిల్లా ఐఆర్‌సీఎస్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు బెల్లంకొండ వెంకటేశ్వరరావు, నడకుదురు లీలాబ్రహ్మేంద్ర, మాజీ వైస్‌చైర్మన్ డాక్టర్ వంగర శేషగిరిరావు, రెడ్‌క్రాస్ ప్రతినిధులు ఆకురాతి హరిప్రసాద్, పెనుమూడి శ్రీనివాసరావు, గరికపాటి హరిప్రసాద్, కోడూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నష్టపరిహారం చెల్లించకుండా ఆస్తుల ధ్వంసమా..?

● మున్సిపల్ మాజీ చైర్మన్ నుగలాపు



గుడివాడ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రైల్వే ఫ్లై ఓవర్ నిర్మాణం పేరిట కొంత మంది అధికారులు అహంకారంగా వ్యవహరిస్తూ లంచమివ్వని వారి ఆస్తులకు నష్టపరిహారం చెల్లించకుండా కోర్టులో స్టే ఉన్నప్పటికీ పోలీసులను అడ్డుపెట్టుకుని తన కుమారుడికి చెందిన భవనాన్ని ధ్వంసం చేశారని మున్సిపల్ మాజీ చైర్మన్ నుగలాపు వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం స్థానిక ఆటోనగర్‌లోని శ్రీశ్రీనివాస ఇంజినీరింగ్ వర్క్స్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భూసేకరణలో నష్టపోతున్న ఆస్తికి తన కుమారుడికి రూ.1.90 కోట్లు వస్తాయని అధికారులు పేర్కొన్నారని, మొదటి విడతలో కేవలం 85 చ.గ.ల స్థలాన్ని మాత్రమే సేకరణలో చూపి రూ.90 లక్షలు ఖాతాలో జమచేశారన్నారు. మిగిలిన 65 చ.గ.ల స్థలానికి ఎలాంటి నష్టపరిహారం ఇవ్వకుండా నోటిఫికేషన్‌ను విడుదల చేశారన్నారు. తాము ప్రశ్నిస్తే తప్పు జరిగిందని, రెండో విడతలో నష్టపరిహారం చెల్లిస్తామని కార్యాలయాల చుట్టూ తిప్పారన్నారు. దీంతో తాము కోర్టును ఆశ్రయించగా, స్టే విధించారని గుర్తు చేశారు. రెండో విడతలో కేవలం రూ.45 లక్షలు తన కుమారుడి ఖాతాలో జమచేశారన్నారు. 15 రోజులుగా తమ భవనానికి ఎలాంటి నష్టం కలుగకుండా భూసేకరణలో పోతున్న భవన ప్రాంతాన్ని ఖాళీ చేయిస్తున్నామన్నారు. మంగళవారం మధ్యాహ్నం పోలీసుల సహకారంతో రెవెన్యూ అధికారుల సమక్షంలో ఎన్‌హెచ్ అధికారులు బలవంతంగా భవనాన్ని ధ్వంసం చేశారన్నారు. తాను బీసీ వర్గానికి చెందినవాడిని కాబట్టే ఇబ్బందులు పెడుతున్నారన్నారు. కోర్టు స్టే ఉన్న నేపథ్యంలో నోటీసులు ఇవ్వకుండా భవనాన్ని ధ్వంసం చేసినవారిపై కోర్టు ధిక్కరణ కేసునమోదు చేసి, న్యాయం జరిగే వరకు పోరాడతానని నుగలాపు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో నుగలాపు సురేష్‌బాబు పాల్గొన్నారు.



కోటి దీపోత్సవం

వన్‌టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక వన్‌టౌన్‌లోని శ్రీ విజయేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలో బుధవారం సెవెన్ హిల్స్ ఆధ్వర్యంలో కార్తీక కోటి దీపోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. వందలాది మంది మహిళలు, యువత హిందూ సంప్రదాయాన్ని ప్రతిబింబిస్తూ తరలివచ్చారు. దీపారాధన చేయించి ఆ వెలుగులో శ్రీ లక్ష్మీదేవి పూజ చేయించారు.







హైవేపై హాహాకారాలు

రక్తమోడుతున్న జాతీయ రహదారులు ● ఓవర్ స్పీడ్‌కు అడ్డుకట్ట వేయలేరా..?

● గంటకు 120 కిలోమీటర్ల వేగంతో దూసుకుపోతున్నాయ్! ● మితిమీరిన వేగానికి కళ్లెం వేయలేని పరిస్థితి

జాతీయ రహదారులు రక్తమోడుతున్నాయి. వాహనాల వేగానికి పరిమితి లేకుండా పోయింది. గంటకు 120 కిలోమీటర్లకు పైగా వేగంతో వాహనాలు నడుస్తున్నాయి. ఈసమయంలో ప్రమాదం బారినపడితే వాహనాలు నామరూపాలు లేకుండా ధ్వంసం కావటమే కాకుండా ప్రాణనష్టం ఎక్కువ. ముఖ్యంగా అతివేగం, నిద్రలేమి, మద్యం మత్తు అంటూ కారణాలు చెబుతున్నారే కానీ ప్రమాదాల నివారణకు పోలీస్, రవాణా అధికారులు చర్యలు తీసుకోవటం లేదు.

- ఆంధ్రజ్యోతి, కంచికచర్ల

జాతీయ రహదారులు అద్దంలా మెరిసిపోతున్నాయి. కుదుపులు రావు. స్పీడు బ్రేకర్లు లేవు. డ్రైవర్లు ఎక్సలేటర్ తొక్కి పెడుతున్నారు. వాహనాలు అతివేగంతో ముందుకు దూసుకువెళుతున్నాయి. ఈ వేగానికి ఏ దశలోనూ కళ్లెం పడటం లేదు. ఆర్టీసీ బస్సులకు స్పీడ్ లాక్ సిస్టమ్ ఉంది. దీంతో అవి 70 కిలోమీటర్ల వేగాన్ని మించి వెళ్లటానికి ఆస్కారం లేదు. అదే ప్రైవేట్ బస్సుల్లో వేగంపై నియంత్రణ లేదు. గంటకు 120 కిలోమీటర్ల వేగంతో నడుపుతున్నారు. జాతీయ రహదారులు విస్తరణకు ముందు విజయవాడ నుంచి హైదరాబాదు వెళ్లేందుకు 8 గంటల సమయం పట్టేది. రోడ్లు చక్కగా, అనువుగా ఉండటంతో ప్రస్తుతం 5 గంటలు కూడా పట్టటం లేదు. గతంలో రాత్రి పూట ఇద్దరు డ్రైవర్లుండేవారు. ఇప్పుడు



ధ్వంసమైన కావేరి బస్సు (ఫైల్)

ఒక డ్రైవర్‌తోనే నడుపుతున్నారు. గత నెల 23న కర్నూల్ జిల్లాలో జరిగిన ఘోర బస్సు ప్రమాదం తర్వాత కూడా ప్రైవేట్ బస్సుల యాజమాన్యాల్లో మార్పు రాలేదు. నందిగామ వద్ద సోమవారం అర్ధరాత్రి జరిగిన ప్రైవేట్ బస్సు ప్రమాదమే తార్కాణం. ఈ ఘటనలో 8 మంది గాయపడ్డారు. అదృష్టవశాత్తు ప్రాణ నష్టం జరగలేదు. అతివేగమే కారణమని అధికారులు చెపుతున్నారు. యాజమాన్యాలు స్పందించి ప్రయాణికుల భద్రతకు పెద్దపీట వేయాలి. ప్రమాదాలు జరిగినపుడు డ్రైవర్లు పరారవుతున్నందున బస్సుల నుంచి బయటపడేందుకు తగిన మార్గాలు గురించి ప్రయాణికులకు ముందుగానే అవగాహన కల్పించాలి. 65వ నెంబర్ జాతీయ రహదారిపై తరుచుగా ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను (బ్లాక్ స్పాట్) అధికారులు గుర్తించారు. నందిగామ బైపాస్, పరిటాల ఆంజనేయ స్వామి విగ్రహం, దొనబండ, కీసర టోల్‌గేట్, జగ్గయ్యపేట ఆటోనగర్ వై జంక్షన్, బలుసుపాడు అడ్డరోడ్డు, షేర్‌మహ్మద్‌పేట వైజంక్షన్, గౌరవరం, నవాబుపేట జంక్షన్ వద్ద తరుచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డు విస్తరణలో భాగంగా ఆయా కూడళ్లలో ఫ్లై ఓవర్లు నిర్మించాలని ఎన్‌హెచ్ఏఐ అధికారులు డీపీఆర్‌లో పేర్కొన్నారు. నందిగామ వద్ద బైపాస్ విస్తరణ పూర్తి కానందున, సర్వీసు రోడ్లు గుంతలమయమై తరుచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. 2017లో ముండ్లపాడు వద్ద దివాకర్ ట్రావెల్స్‌కు చెందిన బస్సు కల్వర్టులో పడింది. ఈ ప్రమాదంలో 10 మంది మృతిచెందారు. 2018లో మార్నింగ్ స్టార్‌కు చెందిన బస్సు కంచికచర్ల వద్ద రోడ్డుపై నుంచి 20 అడుగుల లోయలోకి పడిపోయింది. ఆ తర్వాత నందిగామ, జగ్గయ్యపేట ప్రాంతాల్లో పలు ప్రమాదాలు జరిగాయి. ప్రమాదాలు జరిగినపుడు స్పందిస్తున్న అధికారులు తర్వాత పట్టించుకోవటం లేదు. వాహనాల తనిఖీల్లేవు. అడపాదడపా తప్పితే రెగ్యులర్‌గా డ్రంకెన్ డ్రైవ్ లేదు. మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్న పట్టుకునే వారు లేరు. తెల్లవారు జామున చల్లగాలికి డ్రైవర్లు నిద్రమత్తులోకి జారుకునే అవకాశం ఉంది. ఒక సెకను కన్ను మూతబడినా వాహనం అదుపుతప్పుతుంది. టోల్ ప్లాజాల వల్ల తెల్లవారు జామున డ్రైవర్లు ముఖాలు కడుక్కోవటం వల్ల మత్తుపోతుంది. ముండ్లపాడు ప్రమాదం తర్వాత ఈవిధానాన్ని పోలీసులు అవలంభించగా ప్రమాదాల సంఖ్య తగ్గింది. కాలగమనంలో గాలికి వదిలేశారు. వాహనాల వేగాన్ని కొలిచేందుకు స్పీడ్ గన్స్ లేవు. ప్రమాదాల నివారణకు ప్రస్తుతం విజయవాడ ఈపీ ఎస్పీ రాజశేఖర బాబు పలు చర్యలు చేపట్టారు. ప్రతిరోజూ తెల్లవారు జామున 2 నుంచి 5 గంటల వరకు రహదారులపై పోలీసులు ఎక్కడికక్కడ స్టాప్, వాష్, రిఫ్రెష్ అండ్ గో నిర్వహిస్తున్నారు. బ్లాక్ స్పాట్‌ల వద్ద ట్రాఫిక్ బ్లింకర్స్, రంబుల్ స్ట్రిక్స్‌లు ఏర్పాటు చేశారు.

బిల్లుల వసూళ్లు నూరుశాతం పూర్తి చేయండి

విజయవాడ సిటీ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ బిల్లుల వసూళ్లు నూరు శాతం పూర్తి చేయాలని విద్యుత్ శాఖ అధికారులను ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పుల్లారెడ్డి ఆదేశించారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఎన్టీఆర్ జిల్లా ఎస్ఈ, ఈఈ, డీఈఈ, ఎఈఈతో ఆయన సమావేశమయ్యారు. లో వోల్టేజ్ సమస్యలను పరిష్కరించాలని, పీఎం సూర్యఘర్ పథకంలో మరింత ప్రగతి సాధించాలని సూచించారు. ఈ సమావేశంలో డైరెక్టర్లు మురళీకృష్ణయాదవ్, టీవీఎస్ఎన్ మూర్తి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



తానా ఫౌండేషన్ అందజేసిన స్ప్రేయర్లు, టార్పాలిన్‌ను రైతులకు అందజేస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, కలెక్టర్ బాలాజీ, నిర్వాహకుడు కలపాల రాజాబాబు

తానా సేవలు అభినందనీయం

ఎమ్మెల్యే యార్లగడ్డ ● రూ.25 లక్షలతో రైతులు, విద్యార్థులు, వృద్ధులకు ఉపకరణాల పంపిణీ

హనుమాన్‌జంక్షన్ రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంపై ఆధారపడిన రైతులకు, విద్యార్థుల విద్యాభివృద్ధికి, క్రీడాభివృద్ధికి తానా ఫౌండేషన్ ద్వారా ప్రవాసాంధ్రులు అందిస్తున్న విస్తృత సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. వీరవల్లిలో తానా (తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా) ఫౌండేషన్ ఆధ్వర్యంలో తానా అధికార ప్రతినిధి కలపాల రాజాబాబు పర్యవేక్షణలో రూ.25లక్షల వ్యయం గల ఉపకరణాలను మంత్రి వాసంశెట్టి సుభాష్, కలెక్టర్ డీకే బాలాజీతో కలిసి రైతులకు, విద్యార్థులకు, వృద్ధులకు అందజేశారు. వీరవల్లి చుట్టుపక్క గ్రామాలకు చెందిన రైతులకు స్ప్రేయర్లు, టార్పాలిన్‌తో పాటు పొలంలో పనిచేసేందుకు వీలుగా సేఫ్టీకిట్లను అందజేశారు. 100 మంది వృద్ధులకు దుప్పట్లు, 23 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, క్రీడాపరికరాలు అందజేశారు. వీరవల్లి రైల్వేగేటు వద్ద ఏర్పాటు చేసిన బోరును ప్రారంభించారు. జన్మభూమిని మర్చిపోకుండా తానా అధ్యక్షుడు నరేన్ కొడాలి, లావు శ్రీనివాసరావుతో కలిసి కార్యదర్శి కసుకుర్తి రాజా గ్రామాభివృద్ధితో పాటు వివిధ వర్గాలకు సేవలందించడం అభినందనీయమన్నారు. రైతులు ఆర్థికాభివృద్ధి సాధించేలా ఉద్యానవన పంటలు, ప్రకృతి వ్యవసాయం చేసేలా ప్రోత్సహించేందుకు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. ఆర్బీకేల్లో ధాన్యం కొనుగోలు ప్రారంభమైందని, గతం కంటే 20 శాతం అధికంగా కొనుగోలు చేయడం జరిగిందని కలెక్టర్ బాలాజీ సూచించారు. ఏఎంసీ చైర్మన్ గూడవల్లి నరసింహారావు, మండలాధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు, టీడీపీ నేతలు గుండపనేని ఉమావరప్రసాద్, సర్పంచ్ పిల్లా అనిత, ఉపసర్పంచ్ లంక అజయ్‌కుమార్, ఎంపీటీసీ అమృతపల్లి సూర్యనారాయణ, తెలుగు యువత జిల్లా అధికార ప్రతినిధి మండాది రవీంద్ర పాల్గొన్నారు.

రైతును రాజుగా మార్చేందుకు కృషి

● మంత్రి కొల్లు రవీంద్ర ● అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ 2వ విడత నగదు విడుదల

మచిలీపట్నం టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రైతులను రాజుగా మార్చేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని, సీఎం చంద్రబాబు రైతు బాంధవుడిగా నిలబడ్డారని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మచిలీపట్నం మార్కెట్ యార్డులో బుధవారం అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ 2వ విడత నగదు విడుదల సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన పాల్గొన్నారు. ప్రకృతి వ్యవసాయంతో పండించిన పలు పంటలను పరిశీలించారు. బొర్రపోతుపాలెం రైతు కొక్కా ప్రభావతి పండించిన వేరుశెనగ పంటను చూశారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు అండగా ఉంటుందన్నారు. ధాన్యం విక్రయించిన 24 గంటల్లో నగదు జమ చేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదేనన్నారు. కృష్ణాజిల్లాలో 1,33,856 రైతు కుటుంబాలకు అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.5వేల చొప్పున 2వ విడతగా రూ.66.93 కోట్లు ఇచ్చారని, అలాగే 1,07,809 మంది రైతు కుటుంబాలకు పీఎం కిసాన్ పథకం కింద రూ.21.56 కోట్లు ప్రధాని నరేంద్ర మోదీ విడుదల చేశారన్నారు. ఇలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి రూ. 88.49 కోట్లు ఇచ్చామన్నారు. మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గంలో 7526 రైతు కుటుంబాలకు రూ. 3.76 కోట్లు, పీఎం కిసాన్ పథకం కింద 7071 రైతు కుటుంబాలకు రూ.1.41 కోట్లు ఇలా రైతులకు మొత్తం మీద రూ.5.17 కోట్లు నిధులు జమ చేస్తున్నామన్నారు. నియోజకవర్గంలో 11వేల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని, ఎకరాకు రూ.10వేల చొప్పున రూ.11.42 కోట్ల నష్టపరిహారం ఇస్తామన్నారు. విశాఖ పెట్టుబడుల సదస్సులో రూ.13లక్షల కోట్ల పెట్టుబడి పెట్టేందుకు కార్పొరేట్ కంపెనీలు ముందుకొచ్చాయన్నారు. గూగుల్ వంటి కంపెనీలు లక్షా 35 వేల కోట్ల పెట్టుబడితో వచ్చాయన్నారు.

జిల్లా వ్యవసాయ శాఖాధికారిణి ఎన్ పద్మావతి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ గోపు సత్యనారాయణ, మాజీ జడ్పీటీసీ లంకే నారాయణ ప్రసాద్, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పీవీ ఫణికుమార్, శిష్టుకర్ణ సాధికార కన్వీనర్ అక్కుమహంతి రాజా, తలారి సోమశేఖర్, వసంతకుమారి, కోస్తా మురళీకృష్ణ, వెంకటస్వామి, జనసేన నేత మాదివాడ రాము మాట్లాడారు.



చెక్కులు చూపుతున్న కొల్లు రవీంద్ర, చిత్రంలో రైతులు, కూటమి నేతలు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కేవీ నరసింహా

జిల్లాలో కొండలపై డ్రోన్స్‌తో సీడ్‌బాల్స్

● డ్రోన్స్‌ను ఉచితంగా అందించిన డ్రోన్ రాజా

విజయవాడ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సీపీ రాజశేఖరబాబు సూచనల మేరకు జిల్లా సురక్ష కన్వీనర్ కేవీ నరసింహ జిల్లా మొత్తం కొండలపై డ్రోన్స్ ద్వారా సీడ్‌బాల్స్ వేసే కార్యక్రమం చేపట్టారు. జామ, నేరేడు, సపోటా, చింత మొదలైన ఫలవృక్షాల విత్తనాలు, పర్యావరణానికి, కొండలపై నివసించే ప్రాణులకు ఆహారం అందించాలనే ఉద్దేశంతో ఈ విత్తనాలను జల్లారు. మొత్తం 70 వేల విత్తనాలు వేశామని, డ్రోన్ రాజాగా పేరుపొందిన గోపి డ్రోన్‌ను ఉచితంగా అందించారని, విత్తనాలను కేరళ నుంచి తెప్పించినట్టు కేవీ తెలిపారు.

కొరియాను ఓడించడం

భారత ఆర్చరీ చరిత్రలో మైలురాయి

● ఆర్చర్ బొమ్మదేవర ధీరజ్

విజయవాడ స్పోర్ట్స్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆసియా చాంపియన్‌షిప్ సెమీఫైనల్లో కొరియాను ఓడించడం 45 ఏళ్ల భారత ఆర్చరీ చరిత్రలో ఒక మైలురాయి విజయమని ఆసియా ఆర్చరీ చాంపియన్‌షిప్ బంగారు పతక విజేత బొమ్మదేవర ధీరజ్ అన్నారు. బుధవారం విజయలక్ష్మీ కాలనీలోని చెరుకూరి వోల్గా-వీఎంసీ ఆర్చరీ అకాడమీని సందర్శించిన ధీరజ్ తన గురువు చెరుకూరి లెనిన్ విగ్రహానికి పూలమాలలు సమర్పించి, అకాడమీ చీఫ్ కోచ్ చెరుకూరి సత్యన్నారాయణ నుంచి అభినందనలు అందుకున్నారు. అనంతరం మాట్లాడుతూ రాబోయే అంతర్జాతీయ ఈవెంట్ల కోసం భారత జట్టులో తన స్థానాన్ని దక్కించుకోవడానికి కఠినమైన శిక్షణ పొందుతున్నానని, డిసెంబర్‌లో హైదరాబాద్‌లో జరగనున్న సీనియర్ నేషనల్ చాంపియన్‌షిప్, వచ్చే ఏడాది టోక్యోలో జరగనున్న ఆసియా క్రీడలకు సన్నాహాలపై తన దృష్టి ఉందన్నాడు. ఆసియా చాంపియన్‌షిప్ విజయం నా ఆత్మవిశ్వాసాన్ని ఎంతో పెంచిందని, 2024 పారిస్ ఒలింపిక్స్ ప్రతిబింబిస్తూ రికర్వ్ ఈవెంట్‌లో 681 స్కోరుతో 4వ స్థానంలో నిలిచానని, ప్రస్తుతం దేశంలో నంబర్ వన్, ప్రపంచంలో 13వ స్థానంలో ఉన్నానన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ నాయకత్వంలో ఆర్చర్లకు మెరుగైన ప్రోత్సాహం లభిస్తుందన్న ఆశాభవం వ్యక్తం చేస్తూ ఈ క్రీడలకు మరింత మద్దతు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆంధ్రప్రదేశ్ ఆర్చరీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బెవర వెంకటరామ, ఉపాధ్యక్షుడు బొమ్మదేవర శ్రావణ్ కుమార్, గొట్టిపాటి ప్రేమకుమార్ పాల్గొన్నారు.



బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	130, 139, 150
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 660

ప్రతి ధాన్యం గింజనూ కొనుగోలు చేస్తాం : మంత్రి నాదెండ్ల

పమిడిముక్కల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రైతులు పండిచిన ప్రతి ధాన్యం గింజా కూటమి ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. పామర్రు వైపు వెళుతున్న మంత్రిని తాడంకి వద్ద స్థానిక కూటమి నాయకులు కలసి ధాన్యం కొనుగోలుపై రైతుల అభిప్రాయాలు తెలియజేశారు. ఈ సదర్భంగా హైవే పక్కన రైతులు ఆరబెట్టిన ధాన్యాన్ని మంత్రి పరిశీలించి రైతులతో మాట్లాడారు. ధాన్యాన్ని ఆరబెట్టి తేమశాతం లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు సనకా కిరణ్, జక్కా శ్రీనివాసరావు, నరేశ్ తదితరులు మంత్రిని కలసిన వారిలో ఉన్నారు.


ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న మంత్రి మనోహర్


మంత్రి నాదెండ్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెనిగండ్ల

సమస్యల పరిష్కారానికి సహకరించండి

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ, నవంబరు19(ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని రైతాంగ సమస్యల పరిష్కారానికి సహకరించాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. బుధవారం జిల్లా పర్యటనలో భాగంగా పెడన వెళుతున్న మంత్రి మనోహర్ ఎమ్మెల్యే వెనిగండ్ల ఆహ్వానం మేరకు రాజేంద్రనగర్‌లోని ఎమ్మెల్యే ఇంటికి విచ్చేశారు. మంత్రి నాదెండ్లకు కూటమి శ్రేణులు ఘనంగా ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మాట్లాడుతూ ధాన్యం అమ్మిన వెంటనే రైతులు ఖాతాల్లో రికార్డు స్థాయిలో నాలుగు గంటల్లో నగదు జమ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, మార్కెట్ యార్డు చైర్మన్ చాట్రగడ్డ రవికుమార్, కూటమి నాయకులు దింట్యాల రాంబాబు, మజ్జి శ్రీనివాసరావు, లింగం ప్రసాద్, పంద్రాజు సాంబశివరావు, గణేష్, సత్యసాయి, జబీన్, కరీముల్లా, సర్కార్, ప్రదీప్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


రైతులకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

పురుగు మందు పిచికారీపై అవగాహన

కూచిపూడి : పురుగుల మందులు, సిలీంద్ర నాశికాలు పిచికారి సమయంలో రైతులు పాటించాల్సిన జాగ్రత్తలపై ఆచార్య ఎన్.జి.రంగా విశ్వవిద్యాలయం బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు మొవ్వలో రైతులకు అవగాహన కల్పించారు. పిచికారి సమయంలో రైతులు మాస్కులు, గ్లౌజులు ధరించాలని తెలిపారు. గాలి దిశను అనుసరించి పిచికారి చేయాలన్నారు. పిల్లలు, పశువుల, నీటి వనరుల వద్ద పిచికారి చేయరాదని తెలిపారు. ఈ సందర్భంగా రైతులతో పలు విషయాలపై ముచ్చటించారు. విద్యార్థులు కృపారాణి, దీప్తి, దుర్గ, జాస్మిన్, జశ్వంత్ వల్లితోపాటు రైతులు పాల్గొన్నారు.

టీడీపీ మండల ఎస్సీ విభాగం అధ్యక్షుడిగా పాగోలు

పెదపారుపూడి: టీడీపీ మండల శాఖ ఎస్సీ విభాగం అధ్యక్షుడిగా పాగోలు కాటన్ రాజును అధిష్ఠానం నియమించినట్టు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తనకు పదవిని కేటాయించేందుకు సహకరించిన పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజాకు కృతజ్ఞతలు తెలిపారు.

రైతుల సంక్షేమమే కూటమి ధ్యేయం

● ఎమ్మెల్యేలు వెనిగండ్ల రాము, వర్ల కుమార్ రాజా

గుడివాడ రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం అన్ని రకాలుగా మేలు చేస్తుందని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. బుధవారం గుడివాడ మార్కెట్ యార్డులో అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని ఆదరించినందుకు రైతులకు అన్ని విధాలుగా వ్యవసాయానికి సబ్సిడీలు, అన్నదాత సుఖీభవ పథకాలు అందించి, ఆర్థికంగా ఎదగటానికి కృషి చేస్తామన్నారు. ప్రతి రైతూ పండించిన ధాన్యాన్ని సకాలంలో మిల్లులకు తోలుకుని నగదు చేసుకోవాలని కోరారు. డ్రెయినేజీ, ఇరిగేషన్ పంట కాలువలకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేశామన్నారు. గుడివాడ నియోజకవర్గ జనసేన ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, బూరగడ్డ శ్రీకాంత్, టీడీపీ మండల అధ్యక్షుడు వాసే మురళీ, గుడివాడ మార్కెట్ యార్డు చైర్మన్ చాట్రగడ్డ రవికుమార్, పొట్లూరి రవి, గుడివాడ బీజేపీ కన్వీనర్ దావులూరి సురేంద్రబాబు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ మజ్జాడ నాగరాజు, తెలుగు మహిళా అధ్యక్షురాలు యార్లగడ్డ సుధారాణి, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ సుబ్బారావు పాల్గొన్నారు.


రైతులకు అన్నదాత సుఖీభవ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

తోట్లవల్లూరు : రైతుల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ఆర్థికసాయం అందిస్తోందని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. తోట్లవల్లూరులో బుధవారం అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకం ద్వారా రైతులకు 2వ విడత అందించే సాయం విడుదల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తోట్లవల్లూరు మండల వ్యవసాయాధికారిణి జి.శ్రీదేవి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో పామర్రు నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన 29,500 మంది రైతులకు అన్నదాత సుఖీభవ, 23 వేల మంది రైతులకు పీఎం కిసాన్ పథకం కింద మొత్తం రూ. 19.56 కోట్ల చెక్కుని రైతులకు అందించారు. రైతులందరికీ నేరుగా ఖాతాల్లో డబ్బులు జమవుతాయని ఎమ్మెల్యే తెలిపారు. ఈ పథకాల్లో లేని కౌలు రైతులకు త్వరలో రూ 10 వేల చొప్పున ప్రభుత్వం అందించేందుకు చర్యలు తీసుకుంటుందని వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం కుసుమ కుమారి, పామర్రు వ్యవసాయశాఖ ఏడీఏ స్వర్ణలత, మొవ్వ ఏవో సురేష్ నాయక్, పెదపారుపూడి ఏవో ఎస్. త్రినాథ్ ఆంజనేయులు, పామర్రు ఏవో శివ నాగరాణి, తెలుగు రైతు మండల అధ్యక్షుడు మురళీ, పీఏసీఎస్ అధ్యక్షుడు రామకృష్ణ, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


రైతులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కుమార్ రాజా

గుడ్లవల్లేరు : అన్నదాత సుఖీభవ రెండవ విడత గుడ్లవల్లేరు మండల రైతులకు బుధవారం రైతుల ఖాతాల్లో జమ అయ్యాయి. మండల పరిధిలో 6382 మంది రైతులకు రూ. 4.28 కోట్లు లబ్ధి చేకూరిందని మండల వ్యవసాయాధికారి సునీల్ తెలిపారు.


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పద్మావతి

వైద్యుడి సలహా లేకుండా మందులు వాడొద్దు

తోట్లవల్లూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి) : వైద్యుడి సలహా లేకుండా ఎటువంటి యాంటీబయాటిక్ మందులు వాడితే అనేక అనర్థాలు సంభవిస్తాయని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పద్మావతి తెలిపారు. తోట్లవల్లూరులో మూడు ప్రదేశాల్లో బుధవారం గ్రామసభలు నిర్వహించి యాంటీబయాటిక్ మందుల అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. యాంటీబయాటిక్ మందుల దుష్ప్రభావాలపై వారం రోజుల పాటు ప్రజలకు అవగాహన కల్పించేందుకు అన్ని గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులు అధైర్యపడొద్దు

● ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

పామర్రు : రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోళ్లు చేస్తామని, ఎవరూ అధైర్యపడొద్దని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా తెలిపారు. పామర్రులోని సాయిదుర్గా నగర్ వద్ద బుధవారం ధాన్యం రైతులను కుమార్ రాజా కలుసుకున్నారు. గోనె సంచులు కొరత లేకుండా చూస్తామని, ధాన్యం అమ్మిన రైతులకు వెంటనే డబ్బులు చెల్లిస్తామన్నారు. తేమశాతం విషయంలో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే రైతులకు హామీ ఇచ్చారు.

జానకి రామయ్య ఆశయాలను కొనసాగిస్తాం

● చలసాని ఆంజనేయులు

కూచిపూడి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పాడిరైతుల అభివృద్ధికి ఎంతగానో కృషిచేసి విజయా డెయిరీని అభివృద్ధి పథంలో పయనింప చేసిన కృష్ణామిల్క్ యూనియన్ మాజీ చైర్మన్ మండవ జానకిరామయ్య ఆశయాలను ముందుకు తీసుకువెళతామని విజయా డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు పేర్కొన్నారు. మొవ్వ క్షేత్రయ్య కల్యాణ మండపంలో బుధవారం జానకిరామయ్య సంస్మరణ సభ గ్రామస్థులు, కుటుంబ సభ్యుల సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా చలసాని మాట్లాడుతూ ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని సంస్థను విజయపథంలో నడిపించటంలో జానకి రామయ్య కృషి వెలకట్టలేనిదన్నారు. పాడిరైతులు, విజయ డెయిరీ అభివృద్ధితోపాటు మొవ్వలో విద్యాసంస్థల నిర్మాణంలోనూ, గ్రామాభివృద్ధిలోనూ ఆయన సేవలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ లింగమనేని రామలింగేశ్వరరావు, మండవ వెంకటరత్నం(జానకిరామయ్య కుమారుడు), కృష్ణామిల్క్ యనియన్ మేనేజింగ్ డైరెక్టర్ కొల్లి ఈశ్వరరావు, కృష్ణాజిల్లా పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు గొర్రెపాటి వెంకట రామకృష్ణ, వీరపనేని శివరాం, మొవ్వ ఏఎంసీ చైర్మన్ దోనేపూడి శివరామయ్య, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు వేమూరి పరిశుద్ధరాజు, మండవ రత్నగిరిరావు, షైనేని ఇందిర, వేమూరి సాయివెంకట రమణ, నగేష్, పూర్ణచంద్రరావు, వేమూరి రత్నగిరిరావు, మండవ కోటేశ్వరరావు, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.


మొవ్వలో జానకిరామయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న చలసాని ఆంజనేయులు

ఎన్టీఆర్ స్టేడియంలో సైక్లోథాన్ పోటీలు 30న

గుడివాడ, నవంబరు19(ఆంధ్రజ్యోతి) : నందమూరి తారకరామారావు మెమోరియల్ ఓపెన్ సైక్లోథాన్-2025 పోటీలను ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 30వతేదీన నిర్వహిస్తున్నట్టు స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక స్టేడియం కార్యాలయంలో సైక్లోథాన్-2025 పోటీల బ్రోచర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ అవగాహన కార్యక్రమంలో భాగంగా ఈ పోటీలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మూడు కేటగిరిల్లో నిర్వహించే పోటీల్లో 15-60 సంవత్సరాల లోపు వారికి 25 కిలోమీటర్లు, 15 సంవత్సరాల లోపు, 60 సంవత్సరాల పైబడి ఉన్నవారికి 10 కిలోమీటర్లు, మహిళలకు విడిగా 10 కిలోమీటర్ల మేర సైక్లోథాన్ పోటీలు నిర్వహించనున్నామన్నారు. ఈ సమావేశంలో స్టేడియం కమిటీ సంయుక్త కార్యదర్శి కిలారపు రంగప్రసాద్, ఐఎంఏ గుడివాడ శాఖ అధ్యక్షుడు డాక్టర్ మాగంటి శ్రీనివాస్, వైద్యులు డాక్టర్ పొట్లూరి వంశీకృష్ణ, కమిటీ సభ్యులు నర్రా రత్నశేఖరరావు, గుడివాడ సైక్లింగ్ క్లబ్ సభ్యులు వీరేంద్ర తదితరులు పాల్గొన్నారు.


సైక్లోథాన్-2025 బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు

ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి బాడీ బిల్డింగ్ పోటీల్లో 65 కేజీల విభాగంలో ఎన్టీఆర్ స్టేడియం బాడీ బిల్డర్ బీరం ప్రశాంత్ బంగారు పతకం సాధించినట్టు ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు పేర్కొన్నారు. బుధవారం స్థానిక స్టేడియం కమిటీ కార్యాలయంలో ప్రశాంత్‌ను అభినందించారు. బంగారు పతకం సాధించిన ప్రశాంత్ త్వరలో జరుగబోయే జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించినట్టు ఆయన తెలిపారు.

సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

నందివాడ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్ అని గుడివాడ నియోజకవర్గ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. బుధవారం పుట్టగుంట లోని పంచాయతీ కార్యాలయం వద్ద ప్రజాదర్బార్ కార్యక్రమం కార్యక్రమం నిర్వహించారు. పుట్టగుంట గ్రామంలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో మురుగునీరు రహదారిపై వరదలా ప్రవహిస్తోందని గ్రామస్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. కొంతమందికి స్థలాలు ఉన్నవి కానీ ఇల్లు లేవన్నారు. వెంటనే స్పందించిన వెనిగండ్ల కూటమి ప్రభుత్వం నూతన ఇల్లు నిర్మించుకునేందుకు రూ.2.50 లక్షలు ఇస్తుందని, ఇల్లు నిర్మించుకునే వాళ్లు తమ పేర్లు ఆన్‌లైన్ చేసుకోవాలన్నారు. ఈ ఆన్‌లైన్ ప్రక్రియ నవంబరు 30వ తేదీ వరకు మాత్రమే అవకాశం ఉందన్నారు. అనంతరం ప్రజల అర్జీలను స్వీకరించి సమస్యలు తెలుసుకున్నారు. పుట్టగుంటలో ఆర్టీసీ బస్సులు ఆగేలా చూడాలని , ఆర్టీసీ డిపో అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడి చర్యలు చేపట్టాలన్నారు. గుడివాడ మార్కెట్ యార్డు చైర్మన్ చాట్రగడ్డ రవికుమార్, బూరగడ్డ శ్రీకాంత్, మండల టీడీపీ అధ్యక్షులు సన్యాసిరావు, తహసీల్దార్ గురుమూర్తిరెడ్డి, ఎంపీడీవో మల్లేశ్వరి పాల్గొన్నారు.


సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వెనిగండ్ల

పేదలకు ఆర్థిక భరోసా సీఎంఆర్ఎఫ్

● ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

కూచిపూడి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సీఎంఆర్ఎఫ్ పథకం ద్వారా పేద వర్గాలకు ఆర్థిక భరోసా లభిస్తుందని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. పెడసనగల్లులో వైద్యఖర్చుల నిమిత్తం విడుదలైన చెక్కులను బాధిత కుటుంబాల వారి ఇళ్ల కు వెళ్లి ఎమ్మెల్యే స్వయంగా అందజేసి వారి ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. గ్రామానికిచెందిన దేవినేని లలిత కుమారికి రూ.1,41,000లు, పామర్తి రవికి రూ.31 వేలు, పాతూరి పార్థబాబుకు రూ.46,500ల చెక్కులను ఈ సందర్భంగా అందజేశారు. అంతకుముందుగా చినముత్తేవిలోని రైతు భరోసా కేంద్రాన్ని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ లింగమనేని రామలింగేశ్వరరావుతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నన్నపనేని వీరేంద్ర, తులసీదాస్, యద్దనపూడి రాఘశేఖర్, పెద్ద మస్తానరావు, జయరాజు, వీర్ల నరేష్ పాల్గొన్నారు.


లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కుమార్ రాజా, వీరేంద్ర

పీ4 పథకం ద్వారా పెడసనగల్లుకు చెందిన వేములమడ రాంబాబు సెలూన్ షాపు నిర్మాణానికి నన్నపనేని వీరేంద్ర రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా చేతులమీదుగా అందజేశారు. దాత వీరేంద్రను ఎమ్మెల్యే అభినందించారు.

సబ్సిడీపై డ్రోన్ పంపిణీ

తోట్లవల్లూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : తోట్లవల్లూరుకు చెందిన శ్రీరామ రైతు గ్రూపుకి 80 శాతం సబ్సిడీపై వ్యవసాయ పనులకు ఉపయోగించే డ్రోన్‌ని బుధవారం ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా చేతుల మీదుగా అందజేశారు. రూ.10 లక్షల విలువ గల డ్రోన్‌కి రూ 8 లక్షల సబ్సీడీ ఇచ్చారని, రైతు గ్రూపు కేవలం రూ. 2 లక్షలు చెల్లించిందన్నారు. వ్యవసాయరంగంలో డ్రోన్‌ల పాత్ర ఎంతో ఉందని, రైతులు దీనిని ఉపయోగించుకుంటే మంచి ఫలితాలు సాధించవచ్చని ఎమ్మెల్యే కుమార్ రాజా పేర్కొన్నారు.

రైలు ఢీకొని ఒకరి మృతి

గుడివాడ : స్థానిక ధనియాలపేట రైల్వే గేటు వద్ద సుమారు 35-40 సంవత్సరాల వయస్సు కలిగిన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం పడి ఉన్నట్లు రైల్వే గ్యాంగ్‌మెన్ సమాచారమిచ్చినట్లు రైల్వే జీఆర్పీ ఎస్సై మహబూబ్ షరీఫ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మృతుడి ఒంటిపై కాషాయరంగు గడుల గోధుమరంగు చొక్కా, తెలుపు మచ్చల నల్ల ఫ్యాంటును ధరించి ఉన్నాడన్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్సై షరీఫ్, సెల్ నెం. 94406 27570కు తెలపాలని కోరారు.

కొండవరంలో కార్తీక వనసమారాధన

కూచిపూడి : కార్తీక మాసాన్ని పురస్కరించుకుని కొండవరంలో కులమతాలకతీతంగా గ్రామస్థులు సమష్టిగా కార్తీక వనసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా కార్తీక దామోదరుడికి, పరమేశ్వరుడికి, సత్యనారాయణ స్వామికి గ్రామస్థులు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు.

అన్నసమారాధన

గుడివాడ : స్థానిక పెద్దవీధిలో వేంచేసియున్న వడ్డపోల మాంబ అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా బుధవారం శాంతి నిమిత్తం అన్నసమారాధన నిర్వహించారు. వైసీపీ జిల్లా నాయకులు మండలి హనుమంతరావు, కొంకితల ఆంజనేయ ప్రసాద్, నిర్వాహకులు దానాల సత్తెమ్మ, రత్నాకరరావు, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

దళారీ వ్యవస్థతో రైతుకు తీవ్ర నష్టం

గుడివాడ : లింగవరంలో రైతులకు సంచుల కొరత ఏర్పడిందని, దళారీ వ్యవస్థతో సొసైటీ తరుపున రావల్సిన గోనె సంచులు తక్కువగా ఇస్తున్నారని, దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని సామాజిక కార్యకర్త రవికిరణ్ తెలిపారు. బుధవారం స్థానిక మార్కెట్‌యార్డులో నిర్వహించిన అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బి.అనంతలక్ష్మీకి వినతిపత్రం అందజేశారు.

రైతుబజారు వద్ద ఆక్రమణల తొలగింపు

గుడివాడ, నవంబరు19(ఆంధ్రజ్యోతి) : రైతుబజారు వద్ద వినియోగదారులకు ఇబ్బందులు కలిగిస్తున్న తోపుడు బండ్లను జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, గుడివాడ డీఎస్పీ ధీరజ్‌వినీల్, పట్టణ సీఐల ఆదేశాల మేరకు తొలగించినట్టు ట్రాఫిక్ ఏఎస్సై భాగ్యవతి పేర్కొన్నారు. బుధవారం స్థానిక రైతుబజారు వద్ద, పార్కు వద్ద ఉన్న తోపుడుబండ్లు, ద్విచక్రవాహనాలను ట్రాఫిక్ సిబ్బంది తొలగించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.


ఆక్రమణలను తొలగిస్తున్న ట్రాఫిక్ సిబ్బంది

ఘనంగా కోటి దీపోత్సవం

పెదపారుపూడి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): భూషణగుళ్లలో వేంచేసి ఉన్న గంగా పార్వతీ పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో ట్రస్ట్ బోర్డు చైర్మన్ మండవ రామకోటేశ్వరరావు దంపతుల ఆధ్వర్యంలో సహస్ర దీపాలంకరణ, కోటి దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంపంగి శ్రీకాంత్, ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకోవాలి

● ఎంవీఎస్.లక్ష్మీ


ముగ్గుల పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు

పెదపారుపూడి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం యువత పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకోవాలని గ్రంథాలయ అధికారిణి ఎంవీఎస్.లక్ష్మీ పేర్కొన్నారు. 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా యలమర్రు శాఖా గ్రంథాలయంలో విద్యార్థులచే ముగ్గుల పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ రిటైర్డ్ ఉద్యోగి అవిర్నేని వెంకటేశ్వరరావు, సర్పంచ్ సమీర, ఈశ్వరి కుమారి, జె.విజయలక్ష్మి, సిహెచ్.లక్ష్మి పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు: 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం గుడ్లవల్లేరు, కౌతవరం గ్రంథాలయాల్లో విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. గుడ్లవల్లేరు గ్రంథాలయం ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ విద్యార్థులకు నిర్వహించిన ' పుస్తకాలు మన నేస్తాలు ' అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో 139 మంది విద్యార్థులు పాల్గొన్నారని గ్రంథాలయాధికారిణి టి.వాణి తెలిపారు. కౌతవరం గ్రంథాలయంలో విద్యార్థినులచే రంగవల్లుల పోటీలు నిర్వహించారు.

కూచిపూడి: 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని మొవ్వ శాఖా గ్రంథాలయంలో రంగవల్లుల పోటీలు నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన 70 మంది విద్యార్థినులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. స్థానిక జడ్పీ పాఠశాల పీడీ మండలి మనోహరి గ్రంథాలయాధికారిణి టి.కృష్ణకుమారి పాల్గొన్నారు.

గుడివాడ : 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా షాగులాబ్‌చంద్ ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయంలో బుధవారంముగ్గుల పోటీలు, రక్షణ రంగంలో భారతదేశ పురోగతి అనే అంశంపై వక్తృత్వ పోటీలను నిర్వహించారు.గ్రంథాలయాధికారి ఎం.వి.డి.టి నగేష్, తెలుగుభాషా వికాస సమితి సమన్వయకర్త ప్రసాద్, కవి వసుధ బసవేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పామర్రు : 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా బుధవారం దివంగత ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ జయంతి వేడుకలను నిర్వహించారు. ఇందిరాగాంధీ చిత్రపటానికి గ్రంథాలయాధికారిణి ఝాన్సీరాణి పూలమాల వేసి నివాళలర్పించారు. అలాగే హైస్కూల్లో 9, 10 తరగతి విద్యార్థులకు క్విజ్, డిబేట్, రన్నింగ్ పోటీలను నిర్వహించారు. 20వ తేదీన విజేతలకు బహుమతులను ప్రదానం చేస్తామని ఝాన్సీరాణి తెలిపారు.

పమిడిముక్కల: 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం పమిడిముక్కల శాఖా గ్రంథాలయంలో భారత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. అనంతరం ఇందిరాగాంధీ చిత్రపటానికి గ్రామ సర్పంచ్ ముళ్లపూడి సునీత పూలమాల వేసి నివాళులర్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బి.ఉషా, సలీమున్నీసాను సత్కరించారు. జీసస్ హైస్కూల్ విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. మోహన్‌రావు, ఏసుబాబు, పాల్గొన్నారు.


గుడ్లవల్లేరులో ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	130, 139, 150
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 660

24 నుంచి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు

ఘంటసాల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు ఈనెల 24వ తేదీ నుంచి 27వ తేదీ వరకు నిర్వహిస్తామని ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు గొర్రెపాటి వెంకట రామకృష్ణ, గొర్రెపాటి సురేంద్ర తెలిపారు. 24న ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయని తెలిపారు. 25న సాయంత్రం స్వామిని పెండ్లి కుమారుడిని చేయడం, అనంతరం దేవాలయ ప్రాంగణంలో జగాజ్యోతి, రాత్రి 8 గంటలకు స్వామి కల్యాణం జరుగుతుందని తెలిపారు. 26న ఉదయం షష్ఠి మహోత్సవం నిర్వహిస్తామని, 27తో మహోత్సవాలు పూర్తవుతాయని తెలిపారు.



రైతులతో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్

నచ్చిన మిల్లులో ధాన్యం అమ్ముకోవచ్చు

● మంత్రి నాదెండ్ల మనోహర్

పెడన, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): 'ధాన్యం సేకరించిన 24 గంటల్లోపే సొమ్ములు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నాం. కొనుగోళ్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ ప్రక్రియను కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు పర్యవేక్షిస్తున్నారు. రైతులు తమకు ఇష్టం వచ్చిన మిల్లుల్లో ధాన్యం అమ్ముకునే అవకాశం కల్పించాం.' అని పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. బుధవారం పట్టణంలోని గుడివాడ బైపాస్ రోడ్డులో ధాన్యం ఆరబోసిన రైతులతో ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌తో కలిసి ఆయన మాట్లాడారు. ఈ ప్రాంత పంట దిగుబడులు, ధాన్యం కొనుగోలు సాగుతున్న విధానంపై మనోహర్‌కు ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ వివరించారు. జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, ఆర్డీవో స్వాతి, ఏవో ఎస్.జెస్సీ, తహసీల్దార్ కె.అనిల్‌కుమార్, జడ్పీటీసీ సభ్యుడు అర్జా వెంకట నగేశ్, మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ అబ్దుల్ ఖయూం, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త పంచకర్ల సురేష్, టీడీపీ నాయకులు శలపాటి ప్రసాద్, కమ్మగంటి బాబు, పరసా జితేంద్ర, ఎలిగట్ల ప్రసాద్ పాల్గొన్నారు.

సామాజిక సమరసత కోసం

స్వయం సేవకులు పనిచేయాలి

● సామాజిక సమరసత వేదిక జాతీయ కన్వీనర్ కె.శ్యాంప్రసాద్



మాట్లాడుతున్న సామాజిక సమరసత వేదిక జాతీయ కన్వీనర్ కె.శ్యాంప్రసాద్

చల్లపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సమాజంలో సామాజిక సమరసత అవసరమని, స్వయం సేవకులు సమాజంలో మంచిపనులు చేస్తూ ఆదర్శంగా నిలవాలని సామాజిక సమరసత వేదిక జాతీయ కన్వీనర్ కె.శ్యాంప్రసాద్ పిలుపునిచ్చారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి చిరువోలు బుచ్చిరాజు ఆధ్వర్యంలో ఆర్‌ఎస్‌ఎస్ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా నడకుదురు ఉసిరివనంలో కార్తీకవనసమారాధన, కుటుంబ సమ్మేళనం నిర్వహించారు. మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ వనసమారాధనలో పాల్గొన్నారు. ప్రముఖులతో కలిసి భోజనం చేశారు. నాయకులను, కార్యకర్తలను కలుసుకున్నారు. ప్రముఖ కాలమిస్ట్ దుగ్గరాజు శ్రీనివాసరావు, సీనియర్ న్యాయవాది కామర్సు బాలసుబ్రహ్మణ్యం, బీజేపీ జిల్లా అధ్యక్షుడు తాతినేని శ్రీరామ్, ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా సంఘ చాలక్ కోనేరు బలరాం, సహ సంఘ చాలక్ వై.శాయోజీరావు, ఏఎంసీ చైర్మన్ దోనేపూడి శివరామయ్య, జన్ను జగదీష్, చల్లపల్లి పరిసర మండలాల ముఖ్యులు, బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్, వీహెచ్‌పీ ప్రతినిధులు పాల్గొన్నారు.

పృథ్వీశ్వరస్వామి సేవలో..



పృథ్వీశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ

నడకుదురు పృథ్వీశ్వరస్వామి ఆలయాన్ని మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ సందర్శించారు. స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో వై.శ్రీనివాసు, ఆలయ సమగ్ర అభివృద్ధి దాత మండవ రవీంద్ర, సర్పంచ్ గొరిపర్తి సురేష్, ఆలయ అర్చకులు దత్తాత్రేయను ఆలయ మర్యాదలతో సన్మానించారు. తహసీల్దార్ డి.వనజాక్షి, ఎస్‌ఐ కె.వై.దాస్ మర్యాదపూర్వకంగా కలిశారు.

ఫరీద్‌బాబా దర్గా సందర్శన



దర్గా వద్ద మర్రి శశిధర్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న టీడీపీ నాయకులు

మచిలీపట్నం టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): బందరు మండలం కరగ్రహారంలోని ఫరీద్‌బాబా దర్గాను బుధవారం మాజీ ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి కుమారుడు, ప్రకృతి వైపరీత్యాల నిఘా సంస్థ మాజీ సభ్యుడు మర్రి శశిధర్ రెడ్డి సందర్శించారు. శశిధర్‌రెడ్డికి టీడీపీ నాయకుడు పిప్పళ్ల కాంతారావు, బత్తిన నాగరాజు తదితరులు స్వాగతం పలికారు.

బేస్‌బాల్ జాతీయ పోటీలకు మేఘన



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన నాగాయలంక జడ్పీ హైస్కూల్ ప్లస్ విద్యార్థిని మేఘనతో ఉపాధ్యాయులు

నాగాయలంక, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రైల్వే కోడూరులో నిర్వహించిన అండర్-19 బేస్‌బాల్ రాష్ట్ర టోర్నమెంట్‌లో నాగాయలంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ విద్యార్థిని సముద్రాల మేఘన ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ పోటీలకు ఎంపికయిందని ప్రధానోపాధ్యాయుడు అలపర్తి సత్యనారాయణ తెలిపారు. జనవరిలో ఢిల్లీలో జరిగే జాతీయ పోటీల్లో రాష్ట్రం తరఫున పాల్గొంటుందని ఆయన పేర్కొన్నారు.మేఘనను ఎస్‌ఎంసీ చైర్మన్ వక్కపట్ల లీలా మారుతి, పీడీ జి.లక్ష్మీ ప్రసాద్, కె.శివాజీ తదితరులు అభినందించారు.

చిన్నారుల దత్తత ఇక సులభతరం

చల్లపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): చిన్నారుల దత్తత ఇక సులభతరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సీహెచ్ ఆదిలక్ష్మి, జె.విశ్రాంతమ్మ తెలిపారు. మొవ్వ ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జాతీయ దత్తత అవగాహన కార్యక్రమంలో భాగంగా ఎస్టీ కాలనీలోని అంగన్వాడీ కేంద్రంలో బుధవారం వారు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. చట్టవిరుద్ధంగా పిల్లలను పెంచుకోవడం నేరమని, ప్రభుత్వమే చట్టబద్ధంగా దత్తత ఇస్తుందని, ఆన్‌లైన్‌లో మిషన్ వాత్సల్య.డబ్ల్యుసీడీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో దత్తత కొరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మహిళా పోలీసు వేమూరి లావణ్య, పాఠశాల హెచ్‌ఎం దేవీపార్వతి, ఝాన్సీ, భవిత టీచర్లు లక్ష్మి, గౌరి, పాల్గొన్నారు.

ఆకట్టుకున్న బాలనాగమ్మ



మాయల ఫకీర్ పాత్రలో నటుడు బోలెం రామారావు

మచిలీపట్నం టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పద్యనాటకోత్సవాల్లో భాగంగా మహతి కళావేదికపై శారదా కళానికేతన్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి నిర్వహించిన బాలనాగమ్మ నాటకం అందరినీ ఆకట్టుకుంది. మాయల ఫకీర్‌గా బోలెం రామారావు, సంగు వేషంలో కె.విజయ ప్రేక్షకులకు అలరించారు. తూమాటి రాజేశ్వరరావు, ముత్యాల బాలస్వామి, వేముల సూరిబాబు, ఏలేశ్వరపు పూర్ణచంద్రరావు, లంకిశెట్టి బాలాజీ, రాజబాబు, దశిక రమేష్, అనిల్ చక్రవర్తి పాల్గొన్నారు.

రైతుల ప్రయోజనాలే ధ్యేయం

అవనిగడ్డ, పెడన నియోజకవర్గాల స్థాయి అన్నదాత సుఖీభవ నిధుల జమ సభల్లో ఎమ్మెల్యేలు మండలి బుద్ధప్రసాద్, కాగిత కృష్ణప్రసాద్



అవనిగడ్డలో అన్నదాత సుఖీభవ చెక్కును రైతులకు అందిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, గూడూరు మండలం మల్లవోలులో ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

అవనిగడ్డ/గూడూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం రైతుల ప్రయోజనాలే ధ్యేయంగా పని చేస్తోందని ఎమ్మెల్యేలు మండలి బుద్ధప్రసాద్, కాగిత కృష్ణప్రసాద్ తెలిపారు. అవనిగడ్డ, పెడన నియోజకవర్గాల స్థాయిలో బుధవారం నిర్వహించిన అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ నిధుల జమ కార్యక్రమాల్లో వారు పాల్గొన్నారు. ఈ పథకం కింద అవనిగడ్డ నియోజకవర్గానికి రూ.20.14 కోట్ల లబ్ధి చేకూరగా, బుధవారం రెవెన్యూ హాలులో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిధుల జమ కార్యక్రమాన్ని నిర్వహించారు. రూ.20.14 కోట్ల చెక్కును ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆవిష్కరించారు. టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్మన్లు కొల్లూరి వెంకటేశ్వరరావు, తోట కనకదుర్గ, నియోజకవర్గ ప్రత్యేకాధికారి పెనుమూడి సాయిబాబు, దివి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాజనాల వీరబాబు, ఎంపీపీ తుంగల సుమతి, చల్లపల్లి సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, బీజేపీ నేత తుంగల వెంకటగిరి, తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పెడన నియోజకవర్గంలో రూ. 16 కోట్ల 3 లక్షలు జమ

పెడన నియోజకవర్గంలో రూ. 16 కోట్ల 3 లక్షలు నిధులు రైతుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసిందని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ తెలిపారు. మల్లవోలు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం రైతులకు చెక్కు అందజేశారు. జనసేన నియోజకవర్గ సమన్వయకర్త పంచకర్ల సురేష్, టీడీపీ మండల అధ్యక్షుడు పోతన స్వామి, మల్లేశ్వరం మార్కెట్ యార్డు చైర్మన్ ఒడుగు తులసీరావు, నగిడి చెన్నకేశవరావు, కూనపరెడ్డి వీరబాబు, పెద్దిరాజులు, బాసంశెట్టి వీరబాబు, గోపీ నాగబాబు, ముద్దినేని కొండ, పడవల త్రినాథ్, బత్తిన వీరబాబు, కటకం నాగమల్లేశ్వరరావు, ఎన్ఏ బేగ్, కట్టా మునేశ్వరరావు, పుప్పాల సురేష్ పాల్గొన్నారు.



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

పార్టీలకతీతంగా సీఎంఆర్‌ఎఫ్ అందిస్తున్నాం

● మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పార్టీలకతీతంగా అనారోగ్య బాధితులందరికీ సీఎంఆర్‌ఎఫ్ కింద సాయం అందిస్తున్నామని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. బుధవారం మార్కెట్ యార్డులో సుల్తానగరానికి చెందిన యార్లగడ్డ శేషమ్మకు రూ.1,24,336, సీతారామపురానికి చెందిన బెజవాడ లక్ష్మికి రూ. 57వేల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను మంత్రి అందించారు. టీడీపీ నాయకులు గొర్రెపాటి గోపీచంద్, కాగిత వెంకటేశ్వరరావు, లంకే నారాయణప్రసాద్, గోపు సత్యనారాయణ, చిట్టిబొమ్మ వనరాజు, జనసేన నాయకుడు మాదివాడ రాము పాల్గొన్నారు.

టీడీపీ జిల్లా కార్యాలయానికి స్థలం పరిశీలన

మచిలీపట్నం టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జిల్లా కార్యాలయానికి మాచవరంలో కేటాయించిన ఎకరం 50 సెంట్ల స్థలాన్ని మంత్రి కొల్లు రవీంద్ర బుధవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గొర్రెపాటి గోపీచంద్, కాగిత వెంకటేశ్వరరావు, అక్కుమహంతి రాజా, ఎండీ ఇలియాస్ పాషా, పిప్పళ్ల కాంతారావు, వెంకటస్వామి పాల్గొన్నారు.



ప్రమాదబీమా చెక్కును అందిస్తున్న టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు

కార్యకర్తల కుటుంబాలకు అండగా టీడీపీ

చల్లపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యకర్తల కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుందని పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు అన్నారు. చల్లపల్లికి చెందిన రావి వేణుగోపాలకృష్ణ ప్రమాదంలో మరణించగా, కార్యకర్తల సంక్షేమ విభాగం ద్వారా మంజూరయిన రూ.5 లక్షల ప్రమాదబీమా చెక్కును బుధవారం వేణుగోపాలకృష్ణ భార్య లక్ష్మికి ఆయన అందించారు. ఎంపీపీ కోట విజయ రాధిక, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, డీసీ చైర్మన్ నిడమానూరి దిలీప్‌కుమార్, ఏఎంసీ చైర్మన్లు కొల్లూరి వెంకటేశ్వరరావు, తోట కనకదుర్గ, కార్పొరేషన్ డైరెక్టర్లు బోలెం నాగమణి, పైడిపాముల స్వప్న పాల్గొన్నారు.

మినుము సాగుకు విత్తనశుద్ధి తప్పనిసరి

చల్లపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మినుము సాగుకు మంచి విత్తనాన్ని ఎన్నుకోవాలని, విత్తనశుద్ధి తప్పనిసరిగా చేశాకే విత్తనాలు చల్లాలని రైతులకు కేవీకే సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి సూచించారు. ఘంటసాల కృషివిజ్ఞానకేంద్ర శాస్త్రవేత్తల బృందం పుచ్చగడ్డ, వక్కలగడ్డ గ్రామాల్లో పర్యటించారు. కోత కోసిన ధాన్యాన్ని పరిశీలించారు. దిగుబడులపై రైతులతో మాట్లాడారు. కేవీకే సస్యరక్షణ శాస్త్రవేత డాక్టర్ రేవతి, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా ఇందిరాగాంధీ జయంతి



కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఇందిరాగాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

మచిలీపట్నం టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని ఇందిరాగాంధీ 109వ జయంతి కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా జరుపుకొన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఇందిరాగాంధీ చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు నివాళులర్పించారు. అబ్దుల్ మతీన్, కొడమంచిలి చంద్రశేఖర్, చిలుకోటి ప్రసాద్, మట్టా దత్తుడు, నల్లబోలు శామ్యూల్ పాల్గొన్నారు

గూడూరు: గూడూరు శాఖా గ్రంథాలయంలో ఇందిరాగాంధీ జన్మదినం సందర్భంగా మహిళా దినోత్సవం నిర్వహించారు. సర్పంచ్ లింగం సులోచనారాణి, జడ్పీహెచ్‌ఎస్ ప్రధాన ఉపాధ్యాయులు బి. విజయకుమారి, సుజాత, గ్రంథాలయ అధికారి నాగరవి పాల్గొన్నారు. అనంతరం మహిళలకు రంగవల్లుల పోటీలు నిర్వహించారు.

ఘంటసాల: ఘంటసాల గ్రంథాలయంలో ఇందిరా గాంధీ చిత్రపటానికి కేవీకే ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ డి.సుధారాణి నివాళులర్పించారు. శాస్త్రవేత్త రేవతి, గ్రంథాలయ అధికారి శరత్ కుమార్, బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. కొడాలి గ్రంథాలయ అధికారి మేడంకి సుబ్బారావు ఆధ్వర్యంలో జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు.

అవనిగడ్డ: అవనిగడ్డ గ్రంథాలయంలో ఇందిరా గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.ఉమారాణి, గ్రంథాలయ అధికారి ఎ.ప్రభ నేతృత్వంలో మహిళా సాధికారతపై యువతకు అవగాహన కల్పించారు. మత్తి వెంకట నిర్మలాదేవి, డాక్టర్ డి.రాజ్యలక్ష్మి పాల్గొన్నారు. మహిళలకు మ్యూజికల్ చైర్స్ అండ్ లెమన్ స్పూన్ పోటీలు నిర్వహించారు.



జిల్లా కేంద్ర గ్రంథాలయంలో కవయిత్రి గుడిపూడి రాధికారాణిని సత్కరిస్తున్న మహిళలు

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

మచిలీపట్నం టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని రిటైర్డు ఎండీవో కృష్ణమోహన్ సూచించారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో తెలుగు బాషా సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం మహిళా దినోత్సవం నిర్వహించారు. మహిళా కవయిత్రి గుడిపూడి రాధికారాణి, గాయనీమణి సింగరాజు కల్యాణిని సత్కరించారు. కొమ్మరాజు కనకదుర్గామహాలక్ష్మి, జంపాన చంద్రిక, డిప్యూటీ లైబ్రేరియన్ బీరం వెంకటరమణ, అప్పినీడి పోతురాజు, భవిష్య, రామ్‌దేవ్ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేసి

గ్రామాలు అభివృద్ధి చేసుకుందాం

గూడూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సర్పంచ్‌లు, అధికారులు సమన్వయంతో పనిచేసి గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించాలని గూడూరు ఎంపీపీ సంగా మధుసూదనరావు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో పిశ్శైలజాకుమారి ఆధ్వర్యంలో బుధవారం సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు టీమ్ 5 క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహించారు. మహాత్మాగాంధీ, బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు నివాళులర్పించారు. వివిధ గ్రామాల సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

సంస్కృతికి ప్రతిబింబాలు వనభోజనాలు

అవనిగడ్డ రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సంస్కృతికి ప్రతిబింబాలు వనభోజనాలు అని ఎంపీడీవో మరియ దేవి అన్నారు. పులిగడ్డ గురుకుల విద్యాలయంలో బుధవారం వనసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంపీడీవో పాల్గొన్నారు. ఆర్టీసీ డీఎం హనుమంతరావు, వైస్ ఎంపీపీ పులిగడ్డ పిచ్చేశ్వరరావు, సర్పంచ్ దాసరి విజయ్‌కుమార్, ప్రిన్సిపాల్ కనపర్తి జాన్, రిటైర్డ్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో రంగవల్లుల పోటీలు

మచిలీపట్నం టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో రంగవల్లుల పోటీలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో విద్యార్థినులు పాల్గొన్నారు.

చల్లపల్లి: చల్లపల్లి శాఖా గ్రంథాలయంలో రంగవల్లుల పోటీలు నిర్వహించారు. పలు పాఠశాలల విద్యార్థినులు ఉత్సాహంగా రంగవల్లులు తీర్చిదిద్దారు. మ్యూజికల్ చైర్, క్విజ్, క్లాసికల్ డాన్స్ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి కె.గణేష్‌కుమార్, ఉపాధ్యాయులు శ్రీలక్ష్మి, మూర్తి, వాసుదేవరావు, పద్మజ పర్యవేక్షించారు.

మోపిదేవి: గ్రంథాలయ వారోత్సవాలు, మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పెదకళ్లేపల్లి శాఖా గ్రంథాలయంలో మహిళలకు దిశ చట్టంపై అవగాహన కల్పించారు. రంగవల్లుల పోటీలు నిర్వహించారు. గ్రామ మహిళలు, పాఠశాల బాలికలు రంగవల్లులు తీర్చిదిద్దారు. గ్రంథాలయ అధికారిణి కె.సోమలత పర్యవేక్షించారు.

పెడన: పెడన శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు జనరల్ నాలెడ్జి పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ బళ్ల మల్లికార్జునప్రసాద్, గ్రంథాలయాధికారి షేక్ కాలేషా, కొసనం లోకనాథం, వేముల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రామలింగ చౌడేశ్వరి ఉత్సవం



చల్లపల్లిలో ఊరేగుతున్న అమ్మవారు

చల్లపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా దేవాంగుల ఇలవేలుపు శ్రీరామలింగ చౌడేశ్వరి అమ్మవారి ఉత్సవం, ఊరేగింపు కార్యక్రమాలు పడమరవీధిలో అంగరంగ వైభవంగా జరిగాయి. ఆలయంలో బళ్లా వెంకటేశ్వరరావు దంపతులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారికి ఊయల సేవ నిర్వహించగా, బళ్ల రవితేజ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేక వాహనంపై అమ్మవారి ఉత్సవమూర్తిని ఉంచి ఊరేగింపు ఉత్సవం నిర్వహించారు. అనంతరం వనసమారాధన నిర్వహించారు. బందరు, పెడన, కప్పలదొడ్డి, పోలవరం తదితర ప్రాంతాల నుంచి వచ్చిన దేవాంగులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు పులి గంగా సుధాకరరావు, బళ్ల వెంకట నాగరమేష్, కమిటీ పెద్దలు పర్యవేక్షించారు.

ఆధార్ సేవలు పునఃప్రారంభం

అవనిగడ్డ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): అవనిగడ్డ హెడ్ పోస్టాఫీసులో ఆధార్ సేవలను పునఃప్రారంభించినట్లు అధికారులు బుధవారం తెలిపారు. కొత్త ఆధార్ నమోదు, శిశు ఆధార్ నమోదు, అడ్రస్ సరి చేయడం, బయో మెట్రిక్ అప్‌గ్రేడేషన్, ఫోన్ నెంబరు, ఆధార్ మార్పు తదితర సేవలను ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు.

చల్లపల్లి ఎస్సైగా కేవై దాస్

చల్లపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): చల్లపల్లి ఎస్సైగా కె.వై.దాస్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకూ ఇక్కడ ఎస్సైగా పనిచేసిన పీఎస్వీ సుబ్రహ్మణ్యం ఇనగుదురు ఎస్సైగా బదిలీపై వెళ్లారు.

దివిసీమ ఉప్పెన మృతులకు నివాళి

అవనిగడ్డ రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పులిగడ్డలోని దివిసీమ ఉప్పెన మృతుల స్మారక స్థూపం వద్ద మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు ఆధ్వర్యంలో వైసీపీ నేతలు నివాళులర్పించారు. జడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, ఎంపీపీ తుంగల సుమతీదేవి, సింహాద్రి వెంకటేశ్వరరావు, రేపల్లె శ్రీనివాసరావు, గాజుల జై గోపాల్ పాల్గొన్నారు.

శివరామకృష్ణ క్షేత్ర నిర్మాణానికి

రూ.1,01,116 విరాళం

కోడూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): శివరామకృష్ణ క్షేత్ర పునర్నిర్మాణానికి గ్రామానికి చెందిన అరజా రవీంద్రబాబు దంపతులు రూ.1,01,116 విరాళాన్ని అందించారు. బుధవారం వారి నివాసానికి నిర్మాణ కమిటీ సభ్యులు వెళ్లి నగదు అందుకున్నారు. అన్నం వెంకట సుబ్బారావు, బడే బావన్నారాయణ, బూరగడ్డ హరినాథ్, జూపూడి సుభాష్ చంద్రబోస్ పాల్గొన్నారు.

పీవీ ఫణికుమార్‌కు సత్కారం

మచిలీపట్నం టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన పీవీ ఫణికుమార్‌ను పశుసంవర్థకశాఖ అధికారులు బుధవారం సత్కరించారు. వర్షం వస్తే ముంపునకు గురయ్యే పశువుల ఆస్పత్రి ప్రాంగణాన్ని ఫణికుమార్ మెరక చేయించారని జిల్లా పశుసంవర్థక శాఖాధికారి ఎన్‌సీహెచ్ నరసింహులు తెలిపారు. పశుసంవర్థక శాఖ డీడీ నాగభూషణబాబు, ఏడీ రాధాకృష్ణమూర్తి, అక్కినేని విజయకుమార్ పాల్గొన్నారు.

ధ్యానంతో మానసిక ఒత్తిడి దూరం

మచిలీపట్నం టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ధ్యానం, యోగసాధనతో మానసిక ఒత్తిడికి దూరం కావచ్చని మాస్టర్ ట్రైనర్ గిరీషాజైన్ అన్నారు. మెడికల్ కళాశాలలో బుధవారం ఎమోషనల్ అసెస్‌మెంట్ ఆఫ్ స్టూడెంట్స్ బై ఎడ్యుకేటర్స్ కార్యక్రమం నిర్వహించారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ టి.టి.కె. రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ రత్నమంజుల, డి.ఆశాలత, ప్రొఫెసర్ సీహెచ్ నిరంజన్‌కుమార్ పాల్గొన్నారు.